www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:9 SUNDAY ,MAY 17,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 9 ఆదివారం 17 మే 2026 పేజీలు :8 వెల: 4/-



## పెట్రో ధరల పెంపు ప్రజల నెత్తిన పిడుగు
### ఈ నిర్ణయంతో అనేక రంగాల పై వ్యతిరేక ప్రభావం



మే 16 హంసకలం వార్త

పెట్రో ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పై స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని ఇప్పుడు - మిగతా2లో

## మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు



మే 16 హంసకలం వార్త

ఉద్యోగులు హక్కులతో పాటు విధులు కూడా గుర్తుంచుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. స్త్రీనిధి సంస్థను అందరం కాపాడుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు స్త్రీనిధి తోడ్పాటు అందిస్తోందని వెల్లడించారు. మైక్రో ఫైనాన్స్ బాధల నుంచి మహిళలకు విముక్తి కోసం స్త్రీనిధి ఏర్పాటయిందని తెలిపారు. - మిగతా2లో

## తైవాన్ పై మాట మార్చిన ట్రంప్

మే 16 హంసకలం వార్త

తైవాన్ అంశం పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు కష్టమైన సమస్యేనని వెల్లడించారు. భౌగోళికంగా ఆ ప్రాంతం తమకు చాలా దూరంలో ఉందని వ్యాఖ్యానించారు. తైవాన్ అంశం క్లిష్టమైన సమస్యే. ఈ ద్వీపం.. చైనాకు కేవలం 95 కిలోమీటర్ల దూరంలో ఉండగా, అమెరికా కు మాత్రం 15 వేల కి.మీ.కు పైగా దూరంలో ఉంది. సుదూర ప్రాంతం కారణంగా మేం వేగంగా స్పందించడం కష్టమే. చైనా చాలా - మిగతా2లో



## నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోడీ

మే 16 హంసకలం వార్త

సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచం లోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. - మిగతా2లో



## 22న నాటి మ్యాచ్ కోసం నకిలీ యాప్‌లు

మే 16 హంసకలం వార్త

మే 22న ఉప్పల్ వేదికగా జరగనున్న ఎస్ఆర్‌హెచ్, ఆర్సీబీ మ్యాచ్‌కు ఉన్న క్రేజ్‌ను సైబర్ కేటుగాళ్లు తమకు అనుకూలంగా మలచుకుంటున్నట్లు సీపీ సజ్జనార్ హెచ్చరించారు. 'సోషల్ మీడియా వేదికగా ఐపీఎల్ టికెట్ల బుకింగ్‌కు సంబంధించి అనేక ప్రకటనలు దర్శనమిస్తున్నాయి. అధికారిక టికెటింగ్ భాగస్వామి అయిన 'డిస్ట్రిక్ట్' యాప్‌ను - మిగతా2లో



## ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

మే 16 హంసకలం వార్త

ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తూ భారత్ పై దాడులు కొనసాగిస్తే ప్రపంచపటంలో పాకిస్థాన్ అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరించారు. భౌగోళికంగా ఉండాలా లేక చరిత్రలో కలిసిపోవాలా అనేది పాకిస్థాన్ తేల్చుకోవాలని వార్నింగ్ ఇచ్చారు. భారత్‌పై దాడులు చేసే ఉగ్రవాద సంస్థలకు మద్దతు - మిగతా2లో



## రైతు సమస్యల పై అదే నిర్లక్ష్యం

మే 16 హంసకలం వార్త

ధాన్యం కొనుగోళ్లు, తరలింపులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి విమర్శించారు. సిఎం రేవంత్ సమీక్షించినా పరిస్థితిలో మార్పు లేదన్నారు. మక్కలు, వరి ధన్యం కొనుగోలు చేసి, సకాలంలో తరలించకపోవడంతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారని అన్నారు. - మిగతా2లో



## బండి భగీరథ్ పై లుకౌట్ నోటీసులు

మే 16 హంసకలం వార్త

బండి భగీరథ్ పై పేట్ బషీరాబాద్ పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బండి సంజయ్ నివాసంలో తనిఖీలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు.. ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్‌లో పోలీస్ బృందాలుగా గాలింపు కొనసాగిస్తున్నారు. అతని కోసం 5 బృందాలు గాలిస్తున్నాయని తెలిపిన పోలీసులు వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ - మిగతా2లో



## నీట్ పేపర్ లీక్ వ్యవహారం

మే 16 హంసకలం వార్త

సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రం పై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారం నాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 22 లక్షల - మిగతా2లో



# నెదర్లాండ్స్ పర్యనటలో ప్రధాని మోడీ

-మొదటిపేజీ తరువాయి

సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌ఆర్‌ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘన స్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.

# ఉగ్రవాదులను ఉసికొల్పితే అంతే సంగతులు

-మొదటిపేజీ తరువాయి

ఇవ్వడం ఆపాలని ఆయన పాక్‌ను హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో భారత్ ఎలాంటి రాజీకీ వెళ్లదని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకునేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఉగ్రవాదులను, వారి మద్దతుదారులను భారత్ ఒకే విధంగా పరిగణిస్తుందని, అందరిపై కఠిన చర్యలు తీసుకుంటుందని పునరుద్ఘాటించారు. అలాగే గతేడాది పహల్గాం దాడికి ప్రతిస్పందనగా నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' గురించి కూడా ద్వివేది మాట్లాడారు. పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాల ఉనికిని 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ప్రపంచానికి తెలియజేశాం. ఉగ్ర స్థావరాలకు సంబంధించిన ఆధారాలు అందజేశాం. పాకిస్థాన్ ఇప్పటికైనా తన తీరు మార్చుకోవాలి. ఆపరేషన్ సిందూర్ రెండో వెర్షన్ మరింత తీవ్ర స్థాయిలో ఉంటుంది. భారత ప్రభుత్వం ఎప్పుడూ దేశ పౌరుల రక్షణ, శ్రేయస్సు విషయంలో రాజీ పడదు. తన మార్గంలో ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే దీటుగా స్పందిస్తుంది' అని ద్వివేది తేల్చి చెప్పారు. ఒవకేళ పాకిస్థాన్ ఉగ్రవాదులను పోషించి, వాళ్లను ఇండియా మీదకు ఉసి గొల్పుతే, అప్పుడు ఆ దేశం ఈ భూమ్మీద ఉండాలా లేదా అన్న అంశాన్ని వాళ్లే నిర్ణయించుకోవాల్సి ఉంటుందన్నారు. చరిత్రలో ఆ దేశానికి స్థానం ఉండాలంటే ఉగ్రవాదులను పెంచి పోషించరాదన్నారు. మానేక్‌షా సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఒకవేళ ఆపరేషన్ సింధూర్ చేపట్టడానికి దారి తీసిన పరిస్థితులు మళ్లీ వస్తే ఏం చేస్తారని ఆయన్ను ప్రశ్నించారు. జనరల్ ద్వివేది తన వ్యాఖ్యల్లో పాకిస్తాన్‌కు నేరుగా వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఇండియా నిలుస్తుందన్నారు. గత ఏడాది మే 7వ తేదీన పాక్‌పై ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. ఆ తర్వాత పాక్ దాడులు చేసినా.. ఇండియా వాటిని తిప్పికొట్టింది. సుమారు 88 గంటల పాటు రెండు దేశాలు యుద్ధం కొనసాగించాయి. మే 10వ తేదీ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరిగింది.

# బండి భగీరథ్ పై లుకౌట్ నోటీసులు

-మొదటిపేజీ తరువాయి

బండి భగీరథ్ పై పేట్ బషీరాబాద్ పోలీసులు లుక్ ఔట్ నోటీసులు జారీ చేశారు. హైదరాబాద్‌లోని బండి సంజయ్ నివాసంలో తనిఖీలు చేపట్టిన సైబరాబాద్ పోలీసులు.. ఢిల్లీ, కరీంనగర్, హైదరాబాద్‌లో పోలీస్ బృందాలుగా గాలింపు కొనసాగిస్తున్నారు. అతని కోసం 5 బృందాలు గాలిస్తున్నాయని తెలిపిన పోలీసులు వెల్లడించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. పోక్సో కేసులో భగీరథ్‌కు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు తెలంగాణ హైకోర్టు నిరాకరించింది. దీంతో భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. బాలిక స్టేట్‌మెంట్ ఇప్పటికే పోలీసులు రికార్డు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు మేజిస్ట్రేట్ ఎదుట బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మరోసారి రికార్డు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం భగీరథ్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. భగీరథ్‌పై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో మే 8న పోక్సో చట్టం కింద కేసు నమోదైంది. బాలిక ఫిర్యాదు మేరకు నమోదైన ఈ కేసులో లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ కేసులో విచారణ నిమిత్తం రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. అయితే పోలీసుల విచారణకు భగీరథ్ గైర్హాజరయ్యారు. అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉందని, పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. భగీరథ్ కోసం పోలీసులు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు.

# నీట్ పేపర్ లీక్ వ్యవహారం

-మొదటిపేజీ తరువాయి

సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారంనాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 22 లక్షల మంది నీట్ విద్యార్థులు నష్టపోయారని, అయినప్పటికీ ప్రధాని దీనిపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణం తొలగిస్తారా? స్వయంగా ప్రధాన మంత్రే ఇందుకు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. 'మోదీ జీ... ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పుడే తొలగించండి' అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. వైద్యకళాశాలల్లో అడ్మిషన్ల కోసం మే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ- కమ్-ఎంట్రన్స్ పరీక్షలో అవకతవకలు వెలుగు చూడటంతో దీనిని రద్దు చేశారు. దీంతో దేశంలోని నలుమూలల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. జూన్ 21 తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, నీట్ పరీక్షల కోసం రెండేళ్ల పాటు 22 లక్షల మంది విద్యార్థులు రేయింబవళ్లు కష్టపడ్డారని, వారి కఠోర శ్రమ బూడిదలో పోసిన పన్నీరయిందని అన్నారు. పరీక్షలకు రెండ్రోజుల ముందే నీట్ పేపర్ వాట్సాప్‌లో డిస్ట్రిబ్యూట్ అయిన విషయం యావద్దేశానికి తెలుసునని చెప్పారు. దీనితో తనకెలాంటి సంబంధం లేదని ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, యూనివర్శిటీ అధికారుల కుమ్మక్కు కావడం వల్లే విద్యావ్యవస్థకు తీవ్రనష్టం జరిగిందని ఆరోపించారు. ప్రతిభ ఆధారంగా కాకుండా సైద్ధాంతిక అనుబంధాల ఆధారంగానే వైస్ ఛాన్స్‌లర్ల నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. వైస్ ఛాన్స్‌లర్ కావడానికి ఎలాంటి సబ్జెక్ట్ నాలెడ్జ్ అవసరం లేదని, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారైతే చాలని, ఈ విషయం యావద్దేశానికి తెలుసునని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ లేకుంటే ఎప్పటికీ వైస్ ఛాన్స్‌లర్లు కాలేరని అన్నారు. దేశంలో 80 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని, రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని లెక్కలు చెప్పారు. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని మరోసారి డిమాండ్ చేశారు.

## పెట్రో ధరల పెంపు..ప్రజల నెత్తిన పిడుగు

-మొదటిపేజీ తరువాయి

ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ – ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్ధాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## తైవాన్ పై మాట మార్చిన ట్రంప్

-మొదటిపేజీ తరువాయి

శక్తిమంతమైన, పెద్ద దేశం కూడా. ఉద్రిక్తతల విషయంలో చైనా, తైవాన్‌లు సంయమనం పాటించాలి అని ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ట్రంప్ చెప్పారు. వారి స్వాతంత్ర్య ఆకాంక్షల కోసం అంతదూరం ప్రయాణించి వేం యుద్ధం చేయాలని అనుకోవడం లేదన్నారు. చైనా పర్యటన అనంతరం ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. తైవాన్ సమస్యను సరిగ్గా పరిష్కరించకపోతే.. అమెరికా–చైనా మధ్య ఘర్షణ తలెత్తే ప్రమాదం ఉందని ట్రంప్‌నకు జిన్‌పింగ్ స్పష్టం చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. తైవాన్ జలసంధిలో అంతటా శాంతి, స్థిరత్వాన్ని పరిరక్షించడమే ఇరుదేశాల మధ్య ఉన్న అతిపెద్ద విషయమన్నారు. అమెరికా– చైనాలు భాగస్వామ్య దేశాలుగా ఉండాలే తప్ప... ప్రత్యర్థులుగా కాదని అన్నారు. తైవాన్‌ను తనలో పూర్తిగా విలీనం చేసుకోవాలని చైనా కోరుకుంటోంది. తైవాన్ స్వాతంత్ర్యాన్ని అమెరికా బహిరంగంగా వ్యతిరేకించాలన్నది చైనా వాదన. 'తైవాన్ విషయంలో చైనా ఏకపక్ష చర్యలకు దిగరాదు' అని ఇంతకాలం అమెరికా స్పష్టం చేస్తూ వచ్చింది. దానికి భిన్నంగా ఇప్పుడు ట్రంప్ మాట్లాడుతున్నారు. తైవాన్‌కు ఆయుధాలు విక్రయించాలా, వద్దా అనే అంశంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని చెప్పడమూ ఆయన వైఖరిలో మార్పును వెల్లడిస్తోంది.

## మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పాటు

-మొదటిపేజీ తరువాయి

ఇప్పటివరకు రూ.24 వేల కోట్ల రుణాలు పంపిణీ చేసిన స్త్రీనిధి అని చెప్పారు. 32 లక్షల మహిళలకు రుణాలు అందించిందని స్పష్టం చేశారు. తెలంగాణ మహిళలకు నమ్మకమైన బ్యాంక్‌గా స్త్రీనిధి ఎదగాలన్నారు. ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ స్త్రీనిధి మోడల్‌ను అనుసరిస్తున్నాయని.. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్న స్త్రీ నిధి బ్యాంక్‌పై కొందరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తప్పుడు ఆరోపణలు వస్తే వెంటనే వెరిఫై చేసి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అప్పుడు ఆరోపణలతో సంస్థ ప్రతిష్ట దెబ్బతినకూడదని మంత్రి వివరించారు. మహిళల అభివృద్దే సమాజ అభివృద్ధికి పునాది అని చెప్పారు. చిన్న వ్యాపారాలు, గృహాధారిత ఉపాధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. ఆదివాసీ మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తున్నాం. స్త్రీనిధి మహిళల కోసం మహిళల ఆధ్వర్యంలో నడిచే సంస్థ. స్త్రీనిధిని కాపాడుకోవాలి. ఉద్యోగ అనుకూల ప్రభుత్వం మా ప్రభుత్వం. స్త్రీ నిధి ఏర్పాటులో, దాన్ని విజయవంతం చేయడంలో కృషి చేసిన విద్యాసాగర్ రెడ్డికి అభినందనలు. నూతన నాయకత్వంలో ఈ సంస్థ మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నానని మంత్రి సీతక్క వెల్లడించారు.

## 22న నాటి మ్యాచ్ కోసం నకిలీ యాప్‌లు

-మొదటిపేజీ తరువాయి

పోలిన రంగులు, లోగోలతో ఉన్న నకిలీ యాప్‌లను సృష్టించి, తక్కువ ధరకే టికెట్లు ఇస్తామంటూ ఊరిస్తున్నారు. ఫేక్ యాప్స్‌తో తస్మాత్ జాగ్రత్త. మ్యాచ్ చూడాలనే ఉత్సాహంతో సోషల్ మీడియాలో వచ్చే అనధికార లింకులను నమ్మి మోసపోవద్దు. ఇలాంటి ఫేక్ యాప్స్, వెబ్‌సైట్ల పై నిఘా ఉంచాం. ఎవరికైనా ఇలాంటి యాప్స్, వెబ్‌సైట్ల గురించి తెలిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి' అని సజ్జనార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

## రైతు సమస్యల పై అదే నిర్లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

ఎన్నికల ముందు ప్రతి వర్గానికి ఆకర్షణీయమైన హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చాక రైతులు, వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులను ఇలా అందరినీ మోసం చేసిందని మండిపడ్డారు. జొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి, రైతులకు మద్దతు కల్పించాలని డిమాండ్ చేసారు. రైతులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నా మం÷–తరులకు కనిపించడం లేదా అని అన్నారు. రైతులను పట్టించుకోని కాంగ్రెస్ పాలనపై తీవ్ర స్థాయి లో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో రైతు భరోసా పేరుతో ఏడాదికి రూ.15 వేల సాయం, కౌలు రైతులకు ఆర్థిక భరోసా, వరికి బోనస్, ప్రతి పంటకు మద్దతు ధర, రైతుబీమా కొనసాగింపు, వృద్ధుల కు పింఛన్ల పెంపు, మహిళలకు భరోసా, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అంటూ అనేక హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. కానీ నేడు రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. వృద్ధులకు భరోసా అందడం లేదని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందన్నారు.

# సంపాదకీయం


## సైక్స్ పీకోట్ ఒప్పందం పశ్చిమాసియా గుండెలో బాకు




నూటపది సంవత్సరాల క్రితం, మే 16, 1916నాడు, బ్రిటిష్, ఫ్రెంచ్ సామ్రాజ్యవాదుల మధ్య ఒక రహస్య ఒప్పందం కుదిరింది. దానివల్ల ఇప్పటికీ మధ్య ప్రాచ్యంలో మత ఘర్షణలు సాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా షియాలు--సున్నీల మధ్య, దక్షిణ టర్కీ, ఉత్తర సిరియా, పశ్చిమ ఇరాక్‌లో వ్యాపించి ఉన్న కుర్దులతో కుర్దిస్తాన్ కోసం, పాలస్తీనాను ఇజ్రాయెల్ దురాక్రమించడం ఇత్యాది పరిణామాలకు పునాది పడింది ఇక్కడే. ఈ రహస్య 'సైక్స్--పీకోట్ ఒప్పందం' ద్వారా ఆ రెండు సామ్రాజ్యాలు మధ్య ప్రాచ్యపటంపై స్కేలుతో గీతగీసి దేశాల్ని పంచుకొన్నాయి. ఆ సమయంలో మధ్య ప్రాచ్యంలోని చాలాభాగం టర్కీ ఓట్టోమన్ సామ్రాజ్య ఆధీనంలో ఉండేది. ఓట్టోమన్ సామ్రాజ్యాన్ని 1299లో ఓస్మాన్--1 నేతృత్వంలో ఓగూజ్ టర్కీయన్లు స్థాపించారు. 15, 16 శతాబ్దాల్లో బలమైన రాజ్యంగా పేరుగాంచింది. 16, 17 శతాబ్దాల్లో ఆస్ట్రియా రాజధాని వియన్నా ముఖద్వారం నుంచి ఆగ్నేయ యూరప్, మధ్య ప్రాచ్యంలో చాలా భూభాగంలో అది విస్తరించింది. హంగేరి, బాల్కన్, గ్రీస్, ఉక్రెయిన్‌లో కొంతభాగం, ఇప్పటి సిరియా, ఇరాక్, జోర్డాన్, లెబనాన్, ఇజ్రాయెల్, పాలస్తీనా, ఈజిప్ట్, ఉత్తరాఫ్రికా, పశ్చిమాఫ్రికాలోని అల్జీరియా వరకూ విస్తరించిన సామ్రాజ్యమది. ఆరు శతాబ్దాలపాటు ఏలిన ఓట్టోమన్ సామ్రాజ్యం 1922లో అంతమైంది. మొదటి ప్రపంచయుద్ధంలో ఓట్టోమన్ సామ్రాజ్యం జర్మనీ పక్షాన నిలబడింది. యుద్ధంలో జర్మనీ ఓడిపోయింది. విజేతలైన ఫ్రెంచ్, బ్రిటిష్ సామ్రాజ్యాలు టర్కీ ఓటమిని పసిగట్టి ఓట్టోమన్ సామ్రాజ్యాన్ని పంచుకొన్నాయి. చర్చల్లో బ్రిటిష్ సామ్రాజ్యం తరపున సర్ మార్క్ సైక్స్, ఫ్రెంచ్ తరపున జొరెజ్లెస్ పీకోట్‌లు పాల్గొనడంతో ఒప్పందానికి ఆ పేరు వచ్చింది. ఈ ఒప్పందానికి ఒక ప్రాతిపదిక గానీ, శాస్త్రీయ దృక్పథం గానీ లేదు. మతం, భాష, జాతీయత, ఆచార వ్యవహారాలు, సంప్రదాయాలు పరిగణనలోకి తీసుకోలేదు. సిరియా, ఇరాక్‌ల మధ్య ఒక అడ్డగీత గీసి ఆ దేశాలను ఏర్పాటు చేసారు. టర్కీకి దక్షిణాన ఉన్న సిరియా, లెబనాన్, ఉత్తర ఇరాక్‌లోని కొంత భాగం ఫ్రెంచ్ ఆధీనంలోకి పోయింది. బ్రిటిష్ ఆధీనంలోకి దక్షిణ, మధ్య ఇరాక్ భాగం, జోర్డాన్‌లు వచ్చాయి. మధ్యధరా సముద్రం నుంచి భారతదేశానికి భూమార్గం కోసం ఇరాక్, మెసపుటేమియా ప్రాంతాన్ని బ్రిటిష్ వారు తీసుకున్నారు. ఈ ఒప్పందం ఆధారంగా బ్రిటిష్ వారు చేసిన రెండవ నమ్మకద్రోహం 1917 నవంబరు రెండున చేసిన బెల్‌ఫోర్ ఒప్పందం. యూకేలో యూదుల ఉద్యమం మేరకు పాలస్తీనా భూభాగంలో యూదుల రాజ్యస్థాపనకు దీనిద్వారా వీలు కల్పించారు. కాలక్రమంలో ఇది ఇజ్రాయెల్‌గా మారి లక్షలాది పాలస్తీనియన్లను పొట్టనపెట్టుకొంది. 1915లో సైక్స్, బ్రిటిష్ ప్రధాని హెర్బర్ట్ ఆస్క్విత్‌తో ఒప్పందానికి సంబంధించిన సరిహద్దుల్ని ఆక్రే (ూాజ=జు) పట్టణంలోని 'ఇ' నుంచి చివరిలో ఉన్న కిర్కుక్ (ఖ×=ఖఖఖ) పట్టణంలోని 'కే' వరకూ పటంమీద తన చేతి వేలును జరుపుతూ సరిహద్దులను నిర్ణయించాలని చెప్పాడట. అరబ్ జాతీయత ఎదుగుదలకు ఈ ఒప్పందం ద్రోహం చేసిందని విశ్లేషకులు భావిస్తుంటారు. అరబ్బులను ఎప్పటికైనా తిరిగి ఇస్లామిక్ స్టేట్ పేరిట కలుపుతామని ఐఎస్ఐఎస్ చెబుతున్నది. మొదటి ప్రపంచయుద్ధ సమయంలో అరబ్బులు ఓట్టోమన్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా ఆర్మీలోనూ, గెరిల్లాలుగానూ పోరాడారు. వారి సహకారాన్ని అర్థించిన బ్రిటిష్ ప్రభుత్వం యుద్ధానంతరం స్వతంత్ర సిరియా అరబ్బుదేశాన్ని పాలస్తీనా, జోర్డాన్, లెబనాన్‌లతో కలిపి ఇస్తామని ప్రకటించినప్పటికీ అందుకు భిన్నంగా రహస్య సైక్స్ -- పీకోట్ ఒప్పందం కుదుర్చుకొన్నందున, ఇప్పటికీ ఈ ఒప్పందాన్ని నమ్మకద్రోహంగానే అరబ్బులు పరిగణిస్తారు. ఒప్పంద పర్యవసానంగా ఉత్తరాన ఫ్రాన్స్, దక్షిణాన బ్రిటిష్‌లు దేశాల్ని పంచుకొన్నాయి. మొదటి ప్రాంతం బాగ్దాద్ నుంచి దక్షిణానికి కువైట్‌ను కలుపుకొని, గల్ఫ్ తీరం వరకు విస్తరించి ఉంది. ఈ ప్రాంతం బ్రిటిష్ వారి ప్రత్యక్ష నియంత్రణలో ఉండేది. రెండవ ప్రాంతంలో నేటి ఉత్తర ఇరాక్, జోర్డాన్, నెగెవ్ ఎడారి కలిసి, సినాయ్ వరకు విస్తరించి ఉన్నాయి. ఈ భాగం బ్రిటిష్ వారి ప్రభావంలో ఉండేది. మూడవ ప్రాంతంలో దక్షిణ లెబనాన్ నుంచి ఉత్తరానికి మెర్సిన్, ఇస్కెందెరున్, అదానా ప్రావిన్సుల వైపు విస్తరించి ఉన్న తీరప్రాంతం ఉండేది. ఈ భాగం ఫ్రెంచ్ వారి ప్రత్యక్ష నియంత్రణలో ఉండేది. నాల్గవ ప్రాంతంలో సిరియన్ ఎడారి ఉండేది. ఈ భాగం ఫ్రెంచ్ వారి ప్రభావంలో ఉండేది. ఐదవ ప్రాంతంలో ఓట్టోమన్ జెరూసలేం సంజాక్ ఉండేది. ఇది చారిత్రక పాలస్తీనా ఉత్తర భాగం. మతపరమైన ప్రాముఖ్యత కారణంగా ఇది ఒక అంతర్జాతీయ ప్రాంతంగా ఉండేది. అయితే, చరిత్రాత్మక నగరాలైన ఏకర్--హైఫాల నియంత్రణ బ్రిటన్‌కు పోయింది. ఇస్తాంబుల్‌లో, బోస్ఫరస్ జలసంధికి ఆనుకుని ఉన్న భూభాగాలలో, తూర్పు అనటోలియాలోని రష్యా సరిహద్దులకు సమీపంలో ఉన్న నాలుగు ప్రావిన్సులలో రష్యా జార్ తన వాటాను ఉంచుకుంటారని ఒప్పందంలో పేర్కొన్నారు. టర్కీ పశ్చిమ తీరాల నియంత్రణను గ్రీస్‌కు, నైరుతి ప్రాంతంపై నియంత్రణను ఇటలీకి ఇచ్చారు. సామ్రాజ్యవాద దేశాలైన బ్రిటిష్, ఫ్రాన్స్, స్పెయిన్, పోర్చుగల్, ఇటలీలు ఆయా ఖండాల్లో వలసవాదం నుంచి విముక్తి, స్వాతంత్ర్యం ప్రకటించేటప్పుడు 'విభజించు పాలించు' సూత్రాన్ని అమలుపర్చాయి. తత్ఫలితంగా స్వాతంత్ర్యానంతరం కూడా ఆ దేశాల్లో అభివృద్ధి జరగనీయకుండా చిచ్చుపెట్టి, ఆయుధాల సరఫరాతో ఎప్పటివలెనే దోచుకొనే విధానాన్ని అవలంబించాయి. స్వాతంత్ర్యం ఇచ్చినట్లే ఇచ్చి ఆయా దేశాల ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ స్వేచ్ఛలను హరించటమే ఇలాంటి రహస్య ఒప్పందాల ఆశయం.

# పొదుపు సరే, విదేశీ మదుపులు ఏవీ







'దేశ ఆర్థిక వ్యవస్థకు నానా సమస్యలు సంచితమవుతున్నాయి. దిగుమతి సుంకాలపై అమెరికాతో మన సంబంధాలు సజావుగా లేవు. అవి కలహశీలంగా పరిణమిస్తున్నాయి. సకల కార్యకలాపాలకు విస్తరిస్తూ, విజృంభిస్తున్న కృత్రిమ మేధ సాంకేతికతను స్వంతంగా సమకూర్చుకోవడంలో మనం వెనుకబడి ఉండడమే కాకుండా తప్పుదోవలో కూడా ఉన్నాము. ఎన్నికలలో జయపతాక నెగురవేసే విషయమై ఎంతగా శ్రద్ధాసక్తులు చూపుతున్నారో అంతకంటే మిన్నగా విదేశీ పెట్టుబడిని మళ్లీ దేశానికి తీసుకువచ్చేందుకు దృష్టి పెట్టాలి, అందుకు దీక్షాదక్షతలు చూపాలి. ప్రైవేట్ పెట్టుబడి స్తబ్ధమైపోయింది. కారణమేమిటి? వ్యాపారరంగ క్షేత్రస్థాయి వాతా వరణం అంతులేని కష్టనష్టాలకు మాత్రమే ఆస్కారమిచ్చేదిగా ఉన్నది. అడుగడుగునా కఠిన నిబంధనలు, దర్యాప్తు సంస్థలు వ్యాపారవేత్తలను అమితంగా భయపెడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాపార సౌలభ్యం ఎలా సాధ్యమవుతుంది? భారత ఆర్థిక వ్యవస్థ శక్తిసామర్థ్యాల పట్ల ఆశావాదులూ ఉన్నారు, నిరాశావాదులూ ఉన్నారు. అయితే ఈ ఇరువురినీ భారత్ ఒకేలా అసంతృప్తికి లోనుచేస్తోంది మనకు ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన స్టాక్ మార్కెట్ ఉన్నది. దానిని కాపాడుకునేందుకైనా మనం జాగరూకత చూపకపోతే ఎలా?' పాఠక మహాశయా, ఇవి నా మాటలు అనుకుంటున్నారా? నావి కావు. పోకిరీ వ్యాఖ్యలు చేసే ముందు కొంచెం నెమ్మదించండి. ఇవి రుచిర్ శర్మ (ఒష్ట్రవ =అంవ ఖఅం ఖీఖశ్రీశ్రీ శీట చీఃఱశీఅం, ఔష్ఠ్రఃష ఖవత్ ఖతీశీఅష్ట్ర ఖఱష్ట్ర ఝఖజాఱఖశ్రీఱంఎ మొదలైన సుప్రసిద్ధ పుస్తకాల రచయిత) వ్యాఖ్యలవి. దేశ ఆర్థిక వ్యవస్థను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం నిర్వహిస్తున్న తీరుతెన్నులకు తీవ్ర అభిశంసనే ఆ వ్యాఖ్యలు. ఆ వ్యాఖ్యలతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నానని ఒప్పుకుంటున్నాను. అమెరికాతో సన్నగిల్లిన సంబంధాలు, విదేశీ పెట్టుబడులను మళ్లీ ఆకర్షించవలసిన ఆవశ్యకత, వ్యాపార సౌలభ్యానికి సానుకూలంగా లేని పరిస్థితులు, దర్యాప్తు సంస్థల పాత్ర గురించి రుచిర్ శర్మ వ్యాఖ్యలతో విభేదించవలసిన అవసరమేమున్నది? ఆ విషయాలేవీ ప్రజల దృష్టికి రావడం లేదు. పార్లమెంటరీ, ప్రజా చర్చలలో వాటిని తెలివిగా ఉపేక్షిస్తున్నప్పుడు ప్రజలకు వాస్తవాలు ఎలా తెలుస్తాయి? నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. రెండు రాష్ట్రాలలో బీజేపీ అధికారంలోకి వచ్చింది. గౌరవనీయ ప్రధా నమంత్రి నరేంద్ర మోదీ ఆనంద డోలికలలో ఉండగా దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని ఆయన గుర్తించారు. ఆ కఠోర సత్యాన్ని ఆయన అసాధారణంగా ఒప్పు కున్నారు. ప్రభుత్వం చేసిన తప్పులు, చేయని ప్రజాహిత పనులకు సంభవించిన, ఇంకా సంభవిస్తోన్న ఎనలేని కష్టనష్టాలకు ఉప శమనంగా ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధాన మంత్రి అభిలషిస్తున్నారు. ఆ మేరకు పిలుపునిచ్చారు కూడా. వాస్తవాలు ఎంత కఠినంగా ఉన్నాయో చూడండి: ఇరాన్‌పై అమెరికా--ఇజ్రాయెల్ సంయుక్త యుద్ధం ప్రారంభమై ఈ నెల 31 నాటికి మూడు నెలలు పూర్తవుతాయి. యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు; పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి; బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.95.70గా ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు; అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతం; గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతం; ఏప్రిల్--డిసెంబర్ 2025లో నికర విదేశీ పెట్టుబడి ఇలా ఉన్నది: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు-- 300 కోట్ల డాలర్లు (ఇది చాలా స్వల్పం) కాగా, విదేశీ సంస్థాగత పెట్టుబడులు 4.3 బిలియన్ డాలర్ల కంటే తక్కువ; 2025--26 ఆర్థిక సంవత్సరంలో ప్రైవేట్ మూలధన పెట్టుబడుల ప్రతిపాదనల మొత్తం విలువ రూ.6.6 నుంచి 6.8 లక్షల కోట్లు; 2025--26లో బంగారం దిగుమతుల విలువ 7200 కోట్ల డాలర్లు; ఏడాదికి 50 రోజుల పని కల్పించే గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసిన తరువాత పేద ప్రజలకు లబ్ధి చేకూర్చే వేతన ఉపాధి కార్యక్రమం ఏదీ అమల్లో లేదు. ఈ సమస్యలన్నిటినీ అధిగమించడమెలా? ప్రస్తుత ఆపత్కా లాన్ని అధిగమిం చేందుకు చేయవలసిన వాటి విషయమై ఆయన నేరుగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవేమిటో చూద్దాం. బంగారం దిగుమతులను నిలిపివేయాలి లేదా గణనీయంగా తగ్గించాలి? అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంట నూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో ఆత్మసంయమనం వహించాలి. అనవసర దిగు మతులను పూర్తిగా నిరోధించాలి. ఇంకా ఇలాంటివే మరికొన్ని. మంచిదే. ప్రజలు పాటిస్తారు. కొన్ని విషయాలలో ప్రభుత్వ సూచనలు రాకముందే వారు వాటిని పాటిస్తున్నారని కూడా చెప్పవచ్చు. మరీ ముఖ్యమైన విష యమేమిటంటే ప్రధానమంత్రి తక్షణమే చేయవలసింది ఒకటి ఉన్నది: తన ప్రభుత్వ పనితీరును నిశితంగా విశ్లేషించుకోవడం. ఆత్మ పరిశీలనతోనే అన్ని మంచి పనులు ప్రారం భమవుతాయి మరి. అద్దూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారకుడుగా మొదట ప్రధానమంత్రినే చెప్పాలి. ఆయన ఇంచుమించు ప్రతి రోజూ ఢిల్లీ నుంచి సుదూర ప్రాంతాలలో ప్రాంభోత్సవాలకు లేదా కొత్త ప్రభుత్వ పదవీ ప్రమాణ స్వీకారోత్సవాలకు విమానంలో వెళ్లుతుంటారు (తిరిగి ఢిల్లీకి వస్తారు). ఆయన కాన్వాయ్ చాలా పొడవుగా ఉంటుంది. ఇప్పుడు దానిని కుదించారనుకోండి. ఇక ఆయన ఆర్థికమంత్రి దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత దుర్గతి గురించి ఒక్కసారి కూడా మాట్లాడలేదు (యూపీఏ ప్రభుత్వ హయాంలో అంతర్జాతీయ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ ఒకటి భారత్‌ను నాలుగు బలహీన ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా పేర్కొన్నదని ఆమె మహదానందంతో చెప్పుతుంటారు). 2013--14లో ప్రపంచవ్యాప్త ఆర్థిక సంక్షోభానికి ట్యాపర్ టాంట్రమ్ (ఒక కేంద్ర బ్యాంకు--సాధారణంగా అమెరికా ఫెడరల్ రిజర్వ్-- తన ఆర్థిక ఉద్దీపనను తగ్గిస్తుందని లేదా పెంచుతుందని సంకేతం ఇచ్చినప్పుడు ఆర్థిక మార్కెట్లలో కనిపించే అస్థిర ప్రతిచర్య) దారి తీసిందని, యూపీఏ ప్రభుత్వం వెన్వెంటనే ప్రతిస్పందించి పటిష్ఠ చర్యలతో పరిస్థితిని చక్కదిద్దిందని ఆమె చెప్పనే చెప్పరు. స్థూల దేశీయోత్పత్తి వృద్ధిరేట్లే యూపీఏ ప్రభుత్వ సమర్థతకు ఒక తిరుగులేని నిదర్శనం. 2012--13లో జీడీపీ వృద్ధిరేటు 5.5శాతం కాగా, సంక్షోభ సంవత్సరంలో అంటే 2013--14లో ఆ వృద్ధిరేటు 6.4శాతంగా ఉన్నది. వాణిజ్య మంత్రి స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేయడంలో మహా బిజీగా ఉంటున్నారు. గత ఐదేళ్ల కాలంలో ఆయన మొత్తం తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై సంతకాలు చేశారు. అయితే ఈ ఒప్పందాలు హామీ ఇస్తున్న వాటికి, నిబంధనలు అనుమతించే వాటికి మధ్య చాలా అంతరం ఉన్నదని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతమెదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయాలని, రూపాయి మారకం రేటుకు స్థిరీకరించాలని ప్రధానమంత్రి సంకల్పించారు. ఇది సరైన, సత్ఫలితాల నివ్వగల ఆలోచనే, సందేహం లేదు. సరే, మళ్లీ రుచిర్ శర్మ వద్దకు వెళదాం. ప్రధానమంత్రి చేయవలసిన కృషి చాలా ఉన్నది. ఆయన తలపడవలసిన సమస్యలు, సవాళ్లు అనేకమున్నాయి. తొట్ట తొలుత ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాల నియంత్రణ వ్యవస్థల (రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సెబీ, సీబీడీటీ, సీబీఐటీ, వాణిజ్య మంత్రిత్వ శాఖ, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మొదలైనవి) పని విధానాన్ని పునఃపరిశీలించాలి; ప్రస్తుత విధానాలు, నిబంధనలను ఉపసంహరించాలి. ఇవి, సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి రాకముందు అంటే 1990ల ముందు కాలంలో వలే నియంత్రణ --ఆధారిత స్వభావంతో ఉన్నాయి. అంతేకాకుండా వ్యాపార సౌలభ్యానికి దోహదం చేసేవిగా కాకుండా ఆ రంగంలోని వ్యక్తులు, సంస్థలను నిరుత్సాహపరిచేవిగా ఉన్నాయన్నది ఒక కఠోర వాస్తవం; దర్యాప్తు సంస్థలను కఠినంగా అదుపుచేయాలి. వాటిని ఎలాంటి సంకుచిత, రాజకీయ ప్రయోజనాలకు ఎవరిపైనా ఉసిగొల్పకూడదు; రూపాయి మారకం రేటు స్థిరపరచాలి. మరింత స్పష్టంగా చెప్పాలంటే రూపాయి విలువను దృఢతరం చేయాలి. ఇవన్నీ చేసినప్పుడు, జరిగినప్పుడే విదేశీ పెట్టుబడులు మళ్లీ మన దేశానికి వస్తాయి. అవి మళ్లీ వెల్లువెత్తేలా ప్రధాని మోదీ పటిష్ఠ చర్యలు చేపడతారా? ప్రస్తుత మంత్రులలో చాలామంది మార్కెట్ సంశయవాదులే అయినందున ఆయన ఆ ఆవశ్యక చర్యలను అంత సులభంగా చేపట్టలేరు. మరి ఆ చర్యలు విధిగా చేపట్టవలసినవి కనుక అందుకు అర్థశాస్త్ర ప్రాజ్ఞులు, వివేకశీలురు అయిన వ్యక్తుల సహాయాన్ని తప్పక తీసుకోవాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు మార్కెట్--స్నేహపూర్వక ఆర్థికవేత్త ఒకరి నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రికి సూచిస్తున్నాను. ఆ బృందంలోని సభ్యులను ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఆ నాయకుడికి విధిగా కల్పించాలి. ఆ నిపుణుల బృందం 15 రోజులలోగా తన సలహాలు నివేదించాలి. ప్రధానమంత్రి వాటిపై అంతే శీఘ్రంగా కార్యాచరణకు పూనుకోవాలి.

# కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. కూకట్‌పల్లిలో రాజకీయ వార్

-దొంగ ఓట్లతోనే గెలిచారా.?.. కృష్ణారావుపై బండి రమేష్ ధ్వజం..

-40 వేల ఓట్లు తొలగించారని ముందే ఎలా చెప్పారు.?..

- అభివృద్ధి చేశానంటూ చెప్పుకుని మళ్లీ సమస్యల పర్యటనలేంటని ఎద్దేవా..

-మూసాపేటలో పాదయాత్ర.. ప్రజా సమస్యలపై అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు..

-అండర్‌పాస్, స్కైవాక్ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ప్రకటన..

కూకట్‌పల్లి, మే 16 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. అసలు ఎస్ఐఆర్ పనులు పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే 40 వేల ఓట్లు తొలగించారని ఎమ్మెల్యే ఎలా ప్రకటించారని ప్రశ్నించారు. "ఒక కోయిల ముందే కూసినట్టు ఎమ్మెల్యే తొందరపడ్డారు అంటూ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే గెలిచిన మెజార్టీ ఈ దొంగ ఓట్లతోనేనా.? అంటూ బండి రమేష్ నిలదీశారు. నియోజకవర్గంలో సమస్యలే లేవు..అంతా నేనే అభివృద్ధి చేశాను అని చెప్పుకునే ఎమ్మెల్యే ఇప్పుడు మళ్లీ పర్యటిస్తూ "ఇక్కడ అది చేస్తా.. అక్కడ ఇది చేస్తా అని ప్రకటించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. మూసాపేట ఆంజనేయనగర్‌లో స్థానిక నాయకులతో కలిసి బండి రమేష్ శనివారం పాదయాత్ర నిర్వహించారు.



కాలనీవాసులు ప్రస్తావించిన త్రాగునీటి సమస్య, రహదారుల దుస్థితి, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పార్కుల అభివృద్ధి, శాంతిభద్రతల సమస్యలపై ఆయన వెంటనే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రధాన రహదారులపై అక్రమ కార్ పార్కింగ్ వ్యవహారంపై ట్రాఫిక్ అధికారులతో కూడా చర్చించారు. మూసాపేట వై జంక్షన్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి, జేఎన్‌టీయూ సమీపంలో స్కైవాక్ బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని బండి రమేష్ తెలిపారు. భరత్‌నగర్ కూరగాయల మార్కెట్ ఎన్నో ఏళ్లుగా బ్రిడ్జి కింద కొనసాగుతున్నప్పటికీ మార్కెట్‌కు స్థలం కేటాయించడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని మండిపడ్డారు. ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మార్కెటింగ్ కమిటీ సభ్యులు, టెంపుల్ కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు, మైనారిటీ నాయకులు, ఎస్సీ సెల్ నాయకులు, బీసీ సెల్ నాయకులు, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు పాల్గొన్నారు..

# జనావాసాల్లో సంతకు బ్రేక్

-బబ్బుగూడ పశువుల సంతపై ప్రజల ఆగ్రహం.. ఎంపీ ఈటెలకు వినతి..

-జనావాసాల మధ్య సంత వద్దు.. స్టేడియం ఏర్పాటు చేయాలని డిమాండ్..


మోతీనగర్, మే 16 ( హంసకలం వార్త )



బబ్బుగూడలో కొనసాగుతున్న పశువుల సంత కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూసాపేట్ డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావుతో కలిసి మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్‌కు స్థానికులు వినతిపత్రం అందజేశారు. మోతీనగర్, కబీర్ నగర్, అవంతి నగర్, రామారావు నగర్ తదితర ప్రాంతాలు వేగంగా జనావాసాలుగా మారుతున్న వేళ బబ్బుగూడ పశువుల సంత ప్రజలకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పశువులను తరలిస్తూ కాలనీల మధ్యగానే భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, దీంతో ట్రాఫిక్ సమస్యలు, దుర్వాసనలు, పారిశుద్ధ్య లోపాలు తీవ్రంగా పెరిగి ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారుతున్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. జనావాసాల మధ్య కొనసాగుతున్న పశువుల సంతను వెంటనే నగర శివార్లకు తరలించాలని, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ స్థలాన్ని క్రీడా అభివృద్ధికి వినియోగిస్తూ మినీ స్టేడియం, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఈటెల రాజేందర్ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు వడ్డేపల్లి రాజేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ రావు, నీరజ్ దుబే, కన్నోదర్, బసవరాజ్, నరసింహ, శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కాలనీల ప్రజలు పాల్గొన్నారు..

# ఓటు జాబితాపై అప్రమత్తం కావాలి



-డూప్లికేట్ ఓట్ల నిర్మూలనపై బీఆర్ఎస్ ఫోకస్..

-పార్టీ బలోపేతానికి సభ్యత్వ నమోదు కీలకం..

గాజుల రామారం, మే 16 ( హంసకలం వార్త )

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు గాజుల రామారం డివిజన్ పరిధిలోని చిత్తారమ్మ ఫంక్షన్ హాల్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై నాయకులు, బీఎల్ఏలు, సంక్షేమ సంఘాల ప్రతినిధులకు ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వివేకానంద్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యానికి ఓటే బలమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో నిజమైన ఓటర్లను గుర్తించడం, డూప్లికేట్ ఓట్లు తొలగించడం, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను గుర్తించడం, లేని వ్యక్తుల పేర్లతో నమోదైన ఓట్లను తొలగించడం, కుటుంబ సభ్యుల ఓట్ల మ్యాపింగ్ చేయడం, కొత్త ఓటర్లను నమోదు చేయడం వంటి అంశాల్లో నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజల్లో చైతన్యం తీసుకువస్తూ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా బీఎల్ఏలు, పార్టీ నాయకులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా రానున్న రోజుల్లో కేసీఆర్ ఆధ్వర్యంలో చేపట్టనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమం, నూతన కమిటీల నియామకం, పార్టీ బలోపేతంపై చేపట్టాల్సిన కార్యాచరణపై కూడా ఎమ్మెల్యే వివేకానంద్ నాయకులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, కస్తూరి బాల్‌రాజ్, కమలాకర్, అంజన్ గౌడ్, నవాబ్ భాయ్, పరుశ శ్రీనివాస్ యాదవ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్‌తో పాటు పలు సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు..

# ఉద్యమ కారుల గళం మళ్లీ గర్జించింది

-ఉద్యమ కారులకు గుర్తింపు.. రేవంత్ నిర్ణయానికి జై తెలంగాణ ధ నినాదాలు..

- బీఆర్ఎస్ పాలనలో ఉద్యమ కారుల నిర్లక్ష్యం.. సమావేశంలో ఆవేదన..

-ఉద్యమ కారులకు రూ.50 వేల పెన్షన్ డిమాండ్..

-అమరవీరుల త్యాగాలకు గౌరవం కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి..

హైదరాబాద్, మే 16 ( హంసకలం వార్త )



తెలంగాణ ఉద్యమ కారులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికు తెలంగాణ ఉద్యమ కారుల ఐక్య వేదిక హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపింది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఐక్య వేదిక సమావేశంలో ఉద్యమ కారులు మాట్లాడుతూ, 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఆలస్యమైనా ఉద్యమ కారుల గుర్తింపునకు చర్యలు ప్రారంభించడం స్వాగతించదగ్గ నిర్ణయమని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనలో నిజమైన ఉద్యమ కారులను విస్మరించారని, పైరవీకారులకు మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని ఉద్యమ కారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరవీరులు, జైలు జీవితం గడిపిన ఉద్యమ కారులు, శారీరక వైకల్యానికి గురైన వారు, ఆర్థికంగా నష్టపోయిన కుటుంబాలను ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కమిటీ ద్వారా నిజమైన ఉద్యమ కారులను గుర్తించి వారికి న్యాయం చేయాలని సమావేశం తీర్మానించింది. ఉద్యమ కారులను తెలంగాణ స్వతంత్ర సమరయోధులుగా గుర్తించి ప్రతి నెల రూ.50 వేల పెన్షన్ ఇవ్వాలని, ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే ఉద్యమ కారుల కుటుంబాలకు ఉచిత వైద్యం, విద్య, 250 గజాల ఇంటి స్థలం, గృహ నిర్మాణానికి ఆర్థిక సహాయం, 5 ఎకరాల భూమి కేటాయింపు, బస్సులు-రైళ్లలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సకల జనుల సమ్మెలో పాల్గొన్న సింగరేణి విశ్రాంత ఉద్యోగులను కూడా ఉద్యమ కారులుగా గుర్తించాలని, ఉద్యమ కారులకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా జై తెలంగాణ తెలంగాణ అమరవీరులకు జోహార్లు అంటూ ఉద్యమ కారులు నినాదాలతో సమావేశ ప్రాంగణాన్ని మార్మోగించారు. సమావేశంలో గజెల్లి వెంకటయ్య, బూర్ల జ్ఞాని, ఏ రాజేశం, సిహెచ్ రామస్వామి, సత్యనారాయణ, కె శంకరయ్య, డి రామస్వామి, రాయమల్లు తదితర ఉద్యమ కారులు పాల్గొన్నారు..

# సైబర్ ముఠా అరెస్ట్

-ఈ-సిమ్ మాయతో రూ.77 లక్షల సైబర్ దోపిడి..

-సిటీబ్యాంక్ అధికారులమంటూ దేశవ్యాప్తంగా మోసం..

-ఓటీపీ డైవర్ట్ చేసి బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేసిన ముఠా..

-పశ్చిమ బెంగాల్‌లో రూ.15 లక్షల నగదు స్వాధీనం..

సైబరాబాద్, మే 16 ( హంసకలం వార్త )




సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ అంతర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠాను ఛేదించి ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశారు. ఫిషింగ్ కాల్స్, సిమ్ మార్పిడి మోసం, ఓటీపీ మళ్లింపు ద్వారా బాధితుల బ్యాంకు ఖాతాలను ఖాళీ చేసిన ఈ ముఠా నుంచి రూ.77,75,451 మోసపూరిత లావాదేవీలకు సంబంధించిన వివరాలను పోలీసులు వెలికితీశారు. ఈ ఘటనపై సైబరాబాద్ సీసీపీఎస్ పరిధిలో క్రైమ్ నెం.2077/2025 కింద భారతీయ న్యాయ సంహిత సెక్షన్లు 318(4), 319(2), 336(3), 338, 340(2)తో పాటు సమాచార సాంకేతిక చట్టం సెక్షన్ 66-డి కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితులు తాము ప్రముఖ క్రెడిట్ కార్డ్ విభాగం అధికారులమంటూ బాధితులను నమ్మించి, టెలికాం ధృవీకరణ పేరుతో ఈ-సిమ్‌లను సాధారణ సిమ్‌లుగా మార్పించేవారు. అనంతరం మాల్వేర్ కలిగిన మొబైల్ ఫోన్లను కొరియర్ ద్వారా పంపించి, వాటిలో సిమ్ కార్డులు వేయించిన వెంటనే ఓటీపీలు, బ్యాంకింగ్ అలర్ట్‌లు నిందితుల వద్దకు మళ్లేలా టెక్నికల్ వ్యవస్థ ఏర్పాటు చేసేవారు. దీంతో బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి అక్రమంగా ప్రవేశించి భారీ మొత్తాలను దోచుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో సలీం మొండల్, అబ్దుల్ అలీమ్ ఎస్కే అలియాస్ మిట్టు, సయ్యద్ హషీమ్ రెజా అలియాస్ టిప్పు, మిజానుర్ రెహమాన్ షేక్, బన్సీధర్, మెహబూబ్ ఆలం అన్సారీ అలియాస్ సూరజ్‌లను అరెస్ట్ చేసి ట్రాన్సిట్ వారెంట్‌పై సైబరాబాద్‌కు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. అనంతరం జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. పోలీసు కస్టడీలో భాగంగా పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించిన సోదాల్లో రూ.15 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సయ్యద్ హషీమ్ రెజా అలియాస్ టిప్పు వద్ద నుంచి రూ.13 లక్షలు, బన్సీధర్ వద్ద నుంచి రూ.2 లక్షలు రికవరీ చేశారు. అదేవిధంగా సలీం మొండల్ వద్ద నుంచి ఆరు మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఐదు సిమ్ కార్డులు, నకిలీ లేబుల్స్, స్టిక్కర్లు, వాయిస్ ట్రాన్స్‌మిటర్ కేబుల్ స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నిందితుల వద్ద నుంచి మరో మూడు మొబైల్ ఫోన్లు సీజ్ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ఫోన్ కాల్స్ ద్వారా ఓటీపీలు, బ్యాంకింగ్ వివరాలు, సిమ్‌కు సంబంధించిన సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. తెలియని వ్యక్తులు పంపే మొబైల్ ఫోన్లు లేదా పరికరాల్లో తమ సిమ్ కార్డులు ఉపయోగించవద్దని సూచించారు. కేసులో మరిన్ని వివరాల కోసం దర్యాప్తు కొనసాగుతోంది..

# మూసాపేట్‌లో సమస్యలపై మాజీ కార్పొరేటర్ పర్యటన



మూసాపేట్, మే 16 ( హంసకలం వార్త )

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పాండురంగ నగర్ వీకర్ సెక్షన్ ప్రాంతంలో పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కమ్యూనిటీ హాల్ పై అంతస్తులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా హాల్ పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ ఇప్పటివరకు పునరుద్ధరణ చేపట్టలేదని, విద్యుత్ వైరింగ్ పూర్తిగా కాలిపోయిందని ప్రజలు వివరించారు. అలాగే తాగునీటి సరఫరా తరచూ నిలిచిపోతుండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలపై స్పందించిన తూము శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి, బస్తీ అధ్యక్షులు అశోక్, రవీందర్, శ్రీనివాస్, మఖ్బుల్, కరుణాకర్, రవి, సంపత్, నాని, ఆనంద్, అర్జున్ పాల్గొన్నారు

# గంజాయి అడ్డాగా కాలనీలు



కైతలాపూర్, మే 16 ( హంసకలం వార్త )

కైతలాపూర్ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జిట్టా సునీల్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో అంజయ్య నగర్, పవన్ నగర్, శ్రీహరి నగర్, ప్రగతి నగర్ ప్రాంతాల్లో భారీ పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రలో పీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ పాల్గొని స్థానికులతో కలిసి కాలనీల్లో పర్యటించారు. పాదయాత్ర సందర్భంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. అంజయ్య నగర్‌లో పార్కుల అభివృద్ధి, తాగునీటి సమస్య, కమిటీ హాల్ నిర్మాణం, రోడ్లపై అక్రమ పార్కింగ్, ట్రాఫిక్ ఇబ్బందులు, యువతకు ఇబ్బందికరంగా మారుతున్న గంజాయి, మద్యం విక్రయాలపై ఆందోళన వ్యక్తం చేశారు. పవన్ నగర్‌లో పార్క్ ఫెన్సింగ్, చిన్నారుల పార్క్ ఏర్పాటు కోరగా, శ్రీహరి నగర్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్డు డివైడర్ ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. ప్రగతి నగర్ నుంచి వసుంధర వైపు వెళ్లే మార్గంలో తీవ్ర ట్రాఫిక్ సమస్య నెలకొంటోందని, నాలాపై ర్యాంప్ నిర్మించాలని కాలనీవాసులు కోరారు. దీనిపై స్పందించిన బండి రమేష్ వెంటనే అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, తుమ్ వేణు, కర్క పెంటయ్య, సురేష్ యాదవ్, ప్రకాష్, మొయిన్, తూమ్ మనోజ్, సలీం, శంకర్, సుశీల్ యాదవ్, బాలరాజ్, అక్బర్, మహేష్, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు..

# సూర్యాపేట ఎస్ఐ శివతేజ పై ఎలాంటి ఫిర్యాదు రాలేదు:ఎస్పీ నరసింహ

మే 16 ( హంసకలం వార్త )



సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ శివతేజపై ఎలాంటి అధికారిక ఫిర్యాదు అందలేదని జిల్లా ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.ఇటీవల ఓ మహిళ తనను ఓ వ్యక్తి వేధిస్తున్నాడంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ,అనంతరం ఆమె స్వచ్ఛందంగా ఆ కేసును వెనక్కి తీసుకున్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులకు, సంబంధిత మహిళ తెలిపిన వివరాల ప్రకారం...ఎస్ఐ శివతేజకు వాయిస్ మెసేజ్ పంపగా, "స్టేషన్‌కు వచ్చి పూర్తి వివరాలు చెప్పండి" అని మాత్రమే సూచించినట్లు వెల్లడైంది.పోలీసులపై ఎలాంటి ఆరోపణలు వచ్చినా వాటిని శాఖ తీవ్రంగా పరిగణి స్తుందని,ప్రతి అంశంపై అంతర్గత విచారణ (ఇంటర్నల్ ఎంక్వయిరీ) తప్పనిసరిగా నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.విచారణలో ఎవరి తప్పు బయటపడినా, వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.అలాగే పోలీస్ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో నిరాధార ఆరోపణలు చేసే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నరసింహ స్పష్టం చేశారు.

# శేరిలింగంపల్లిలో అభివృద్ధి స్పీడ్ పెంచిన గాంధీ

వివేకానంద నగర్, మే 16 ( హంసకలం వార్త )



వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో స్వామి వివేకానంద విగ్రహం నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు అసంపూర్తిగా నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ట్రాఫిక్ పోలీసులు, టౌన్ ప్లానింగ్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, నేమ్ బోర్డులు, ముందుకు వచ్చిన షెడ్లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తగ్గించడంలో సర్వీస్ రోడ్డు కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. స్వామి వివేకానంద విగ్రహం నుంచి సౌత్ ఇండియా షాపింగ్ మాల్ వరకు పూర్తైన రోడ్డు వల్ల కాలనీవాసులకు ఉపశమనం లభించిందన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి వివేకానంద నగర్ చౌరస్తా వరకు మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకత్వంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని ఆరెకపూడి గాంధీ తెలిపారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తూ ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా కోసం కృషి చేస్తామని చెప్పారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అధికారులు జాప్యం లేకుండా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ట్రాఫిక్ సీఐ తిమ్మప్ప, టౌన్ ప్లానింగ్ టీపీఎస్ మధు, విద్యుత్ విభాగం ఏఈ చైతన్య, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, చిరుమర్తి రాజు, పురెందర్ రెడ్డి, జి నర్సింగ్ రావు, లక్ష్మీనారాయణ, కిషోర్, జి ప్రసాద్, వెంకటేశ్వరరావు, కె.వి.రావు, కొండారెడ్డి, డి వెంకటేశం పాల్గొన్నారు.

# పోలీస్ సేవలో మచ్చలేని అధికారి

-కానిస్టేబుల్ నుంచి డీఎస్పీ వరకు బంటు రాములు విజయగాథ..

-పేదరికాన్ని జయించిన పోలీస్ అధికారి జీవితం పుస్తకంగా..

-సేవే లక్ష్యంగా రిటైర్మెంట్ తర్వాత కూడా బంటు రాములు దూసుకెళ్తున్నారు..

-విద్యార్థులకు అండగా నిలిచిన మాజీ డీఎస్పీకి ఘన సన్మానం..

మే 16 ( హంసకలం వార్త )

మారుమూల గ్రామం కదుమూరు నుంచి పేదరికాన్ని ఛేదించి పోలీసు శాఖలో కానిస్టేబుల్ స్థాయి నుంచి డీఎస్పీ హోదా వరకు ఎదిగిన దిశాలి బంటు రాములు జీవన ప్రయాణం ఆధారంగా రూపొందిన జీవిత గాథ" పుస్తక ఆవిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు బేరి రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో బంటు రాములను శాలువాతో సత్కరించి ఘనంగా అభినందించారు. 38 సంవత్సరాల పాటు ఎలాంటి మచ్చలేని సేవ చేసిన బంటు రాములు కఠినమైన కేసులను ఛేదించి నేరస్తులకు శిక్ష పడే వరకు వెనుకడుగు వేయని నిజాయితీ పోలీసు అధికారిగా గుర్తింపు పొందారు. పేదరికంలో పెరిగినా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవడమే కాకుండా తన పిల్లలను అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, సౌదీ అరేబియా దేశాల్లో ఉన్నత విద్యలు అభ్యసించే స్థాయికి తీసుకెళ్లడం విశేషమని బేరి రామచంద్ర యాదవ్ కొనియాడారు. బంటు రాములు జీవిత విశేషాలను జగదీష్, బిక్షమయ్య సహకారంతో పుస్తక రూపంలో తీసుకు రావడం పేద విద్యార్థులకు మార్గదర్శకంగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు. రిటైర్మెంట్ అనంతరం కూడా యూట్యూబ్ వేదికగా ప్రజలకు సేవలందిస్తూ, కదుమూరు మండలం పూడూరులో విద్యార్థులకు పుస్తకాలు, నోటుబుక్కు పంపిణీ చేయడంతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులను నియమించి వారి వేతనాలు భరిస్తుండటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. పేదలకు విద్య, ఉద్యోగ సలహాలు అందిస్తూ అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడం బంటు రాములు లక్ష్యమని బేరి రామచంద్ర యాదవ్ తెలిపారు. భవిష్యత్తులో కూడా ప్రజాసేవలో ముందుండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్కే సాయన్న ముదిరాజ్, బీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొని పుస్తకావిష్కరణతో పాటు బంటు రాములను సన్మానించారు. అనంతరం బంటు రాములు బేరి రామచంద్ర యాదవ్ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.



# పోక్సో కేసులో బండి భగీరథ్ హైడ్రామా

-లొంగిపోయారా అరెస్ట్ అయ్యారా?

మే 16 ( హంసకలం వార్త )

:కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో గత కొన్ని రోజులుగా కొనసాగిన హైడ్రామాకు శనివారం కీలక మలుపు తిరిగింది. పరారీలో ఉన్నట్లు ప్రచారం జరిగిన భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట హాజరయ్యారు.అయితే ఆయన స్వచ్ఛందంగా లొంగిపోయారా? లేక పోలీసులు అరెస్ట్ చేశారా? అన్న అంశంపై గందరగోళం నెలకొంది. మైనర్ బాలికను వేధించారనే ఆరోపణలపై పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైంది.ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించినప్పటికీ కోర్టు ఉపశమనం ఇవ్వలేదు. అంతేకాకుండా దేశం విడిచి వెళ్లకుండా పోలీసులు లుకౌట్ నోటీసులు కూడా జారీ చేశారు. దీంతో న్యాయవాదుల సలహా మేరకు భగీరథ్ పోలీసుల విచారణకు హాజరైనట్లు సమాచారం.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..."చట్టం ముందు అందరూ సమానమే.నా కుమారుడు అయినా,సామాన్యుడు అయినా చట్టానికి లోబడాల్సిందే. చట్టాలపై గౌరవంతోనే అడ్వకేట్ల సమక్షంలో భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాం"అని తెలిపారు.తన కుమారుడు ఎలాంటి తప్పు చేయలేదని చెబుతున్నాడని,తమ వద్ద ఉన్న ఆధారాలను న్యాయవాదులకు చూపించామని చెప్పారు.బెయిల్ వస్తుందనే నమ్మకంతో కొంత ఆలస్యం జరిగిందని, అయినప్పటికీ న్యాయవ్యవస్థపై గౌరవంతో విచారణకు సహ కరించాలని నిర్ణయించుకున్నామని వివరించారు. అయితే బండి సంజయ్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే మరో ట్విస్ట్ చోటుచేసుకుంది .భగీరథ్‌ను నార్సింగి ప్రాంతంలో అరెస్ట్ చేసినట్లు రమేష్ రెడ్డి ప్రకటించారు. దీంతో భగీరథ్ స్వచ్ఛందంగా లొంగిపోయారా? లేక పోలీసులు అదుపులోకి తీసుకున్నారా? అనే అంశంపై రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.ప్రస్తుతం భగీరథ్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం .కేసు దర్యాప్తు కొనసాగుతోంది.



# ఇందిరమ్మ ఇళ్ళ పురోగతి, డబుల్ బెడ్ రూమ్ ల కేటాయింపుపై కలెక్టర్ సమీక్ష

మే 16 ( హంసకలం వార్త )

ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల పురోగతి, రెండు పడక గదుల కేటాయింపుపై కలెక్టర్ ఇలా త్రిపాఠి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో శనివారం సమీక్ష జరిపారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ళను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మొదటి విడతలో ఆయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాలు పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం చేపట్టేందుకు ముందుకురాని వారి మంజూరీలను రద్దు చేసిన చోట, వారి స్థానంలో అర్హులైన కొత్త వారిని వెంటనే లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ వారం రోజుల్లోపు పూర్తి చేయాలని గడువు విధించారు. ఇందిరమ్మ కమిటీలను సంప్రదించి ఆసక్తి కలిగిన అర్హులను గుర్తించాలన్నారు. ఇప్పటికే ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఫోటో, పూర్తి వివరాలతో జియో ట్యాగింగ్ సహా సత్వరమే సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేందుకు లాటరీ విధానం ద్వారా లబ్ధిదారులను ఖరారు చేయాలని, వీడియోగ్రఫీ మధ్యన జిల్లా అధికారుల సమక్షంలో పారదర్శకంగా ఈ ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. అన్ని చోట్ల ఈ నెలాఖరు లోపు డబుల్ బెడ్ రూమ్ ల పంపిణీ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, హౌసింగ్ పీ.డీ గంగాధర్, ఎ.ఈ నివర్తి తదితరులు పాల్గొన్నారు.



# అంతరాష్ట్ర ముఠాల కదలికలపై నిఘా

-కమిషనరేట్ పరిధిలో భద్రత కట్టుదిట్టం.
-పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం.

మే 16 ( హంసకలం వార్త )

ఇటీవల కాలంలో అంతరాష్ట్ర సాయుధ ముఠాలు బ్యాంకులు, జ్యువెలరీ షాపులు, ఆర్థిక సంస్థలను లక్ష్యంగా చేసుకుని నేరాలకు పాల్పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యంత కట్టుదిట్టమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీస్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల పీఎంజే జ్యువెలర్స్ లో జరిగిన ఘటనను దృష్టిలో ఉంచుకుని, కమిషనరేట్ పరిధిలోని అన్ని వ్యాపార, ఆర్థిక సంస్థల యాజమాన్యాలు, సెక్యూరిటీ ఏజెన్సీలు కింది రక్షణ సూచనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు.సంస్థల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, క్యాష్ కౌంటర్లు, లాకర్ రూములు కవర్ అయ్యేలా హై-రిజల్యూషన్ నైట్ విజన్ సీసీటీవీ కెమెరాలను నిరంతర విద్యుత్ బ్యాకప్‌తో ఏర్పాటు చేసుకోవాలని, వాటి ఫుటేజీని కనీసం 90 రోజుల పాటు భద్రపరచాలని సూచించారు. సమీప పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించబడిన బర్గర్ అలారాలు, పానిక్ బటన్లను అమర్చడంతో పాటు, గుర్తింపు పొందిన శిక్షణ కలిగిన సాయుధ సిబ్బందిని నియమించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, లోపలి ప్రాంగణంలోకి అనవసరమైన వ్యక్తుల రాకపోకలను నియంత్రించాలని, నగదు లేదా బంగారం రవాణా సమయాల్లో తీవ్ర గోప్యత పాటించాలని, సంస్థల్లో పనిచేసే రెగ్యులర్, తాత్కాలిక సిబ్బందికి పోలీస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. హెల్మెట్ ధరించి అనవసరంగా లోపలికి వచ్చే వారి పట్ల, పరిసరాల్లో రెక్కీ నిర్వహిస్తున్నట్లు అనుమానం వచ్చే వారి పట్ల యాజమాన్యాలు, సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో సాయుధ నేరగాళ్లను నేరుగా ఎదుర్కొని ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా, కస్టమర్ల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.మరోవైపు, అంతరాష్ట్ర ముఠాల కదలికలను అణచివేసేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృతమైన నిఘా చర్యలు చేపట్టినట్లు సీపీ వివరించారు. వాణిజ్య సముదాయాలు, బ్యాంకులు, ఏటీఎం పరిసరాల్లో బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాల ద్వారా 24 గంటల నిరంతర పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. నగర ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, జాతీయ రహదారులపై ఆకస్మిక నాకాబందీలు, ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతరాష్ట్ర ముఠాలు, చోరీ సొత్తును కొనుగోలు చేసేవారిపై నిఘా ఉంచేందుకు స్పెషల్ బ్రాంచ్, టాస్క్ ఫోర్స్, లోకల్ పోలీసులు సమన్వయంతో పనిచేస్తున్నారని, పొరుగు జిల్లాలు, ఇతర రాష్ట్రాల పోలీస్ ఏజెన్సీలతో నిరంతరం సమాచారాన్ని పంచుకుంటున్నట్లు పేర్కొన్నారు. నగరంలోని లాడ్జీలు, హోటళ్లు, అద్దె ఇళ్లు మరియు



కొత్తగా వలస వచ్చిన అనుమానాస్పద వ్యక్తుల వివరాలను సేకరించి ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నామని, పాత నేరస్థుల కదలికలపై ప్రత్యేక సాంకేతిక నిఘా ఉంచామని తెలిపారు.అంతరాష్ట్ర వ్యవస్థీకృత నేరాలను సమర్థవంతంగా అడ్డుకోవడంలో ప్రజలు, వ్యాపారుల సహకారం ఎంతో కీలకమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు. పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అనుమానాస్పద కదలికలు కనిపించినా, గుర్తుతెలియని వ్యక్తులు నిఘా వేసినట్లు గమనించినా, లేదా అనుమానాస్పద వాహనాలు నిలిపి ఉంచినా వెంటనే పోలీసులకు లేదా 'డయల్ 100/112' కు సమాచారం అందించి సహకరించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజల ఆస్తుల రక్షణకు కరీంనగర్ పోలీస్ యంత్రాంగం పూర్తి అంకితభావంతో పనిచేస్తుందని సీపీ స్పష్టం చేశారు.

# నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్లో దళితుడిపై థర్డ్ డిగ్రీ

-దీనికి కారణమైన రూరల్ ఎస్ఐ,నలుగురు కానిస్టేబుళ్లను వెంటనే సస్పెండ్ చేయాలి
-కెవిపిఎస్,ఎమ్మార్పీఎస్,ఎరుకల సంఘం నాయకుల డిమాండ్

మే 16 ( హంసకలం వార్త )



నల్లగొండ రూరల్ మండలం కుదవన్‌పూర్ గ్రామానికి చెందిన కొత్తపల్లి శంకర్(45) అనే ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని దొంగతనం కేసు పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించి రూరల్ ఎస్ఐ సైదాబాబు మరియు నలుగురు కానిస్టేబుళ్లు విచక్షణారహితంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించి తీవ్రంగా హింసించడం అమానుషమని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, ఎమ్మార్పీఎస్--ఎంఎస్పి జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్ మాదిగ, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు మానుపాటి భిక్షమయ్య,కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గాదె నర్సింహాలు తీవ్రంగా ఖండించారు. నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు కొత్తపల్లి శంకర్‌ను కలిసి పరామర్శించిన అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... గ్రామానికి చెందిన ఎన్ని జాన్‌రెడ్డి ఇంట్లో బంగారం పోయిందనే అనుమానంతో ఈ నెల 9వ తేదీన జరిగిన ఘటనపై,15వ తేదీన శంకర్‌ను విచారణ పేరుతో పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని తెలిపారు. అయితే వాస్తవాలు తెలుసుకోకుండా పోలీసులు విచక్షణ కోల్పోయి బట్టలు ఊడదీసి దారుణంగా కొట్టడంతో పాటు బూతు మాటలు మాట్లాడుతూ కులం పేరుతో దూషించారని ఆరోపించారు.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన శంకర్ ప్రస్తుతం నల్లగొండ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడని,ఒక వ్యక్తిని అనుమానితుడిగా పిలిచి విచారణ చేయడం వరకు పోలీసులకు అధికారాలు ఉన్నప్పటికీ,చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని థర్డ్ డిగ్రీ ప్రయోగించడం మానవ హక్కుల ఉల్లంఘనతో పాటు రాజ్యాంగ విరుద్ధమని అన్నారు.ఇటీవల కాలంలో పోలీసుల ఆగడాలు మితిమీరి పోతున్నాయని, ముఖ్యంగా పేదలు, దళితులపై అణచివేత ధోరణి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.బాధితుడిపై దాడికి పాల్పడిన రూరల్ ఎస్ఐ సైదాబాబు మరియు సంబంధిత నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయం ముట్టడి కార్యక్రమం కూడా నిర్వహిస్తామని ప్రకటించారు.

# ఆటోకు తాడుగట్టి లాగుతూ నిరసన వ్యక్తం చేసిన సిపిఎం

మే 16 ( హంసకలం వార్త )

:కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాందేవ్ వాడలో సిపిఎం కార్యాలయం నుండి హమాల్ వాడి చౌరస్తా వరకు ఆటోకు తాడుగట్టి పార్టీ కార్యకర్తలు ఆటోను లాగుతూ నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు .అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగిన సందర్భంగా దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలను ఎట్టి పరిస్థితుల్లో పెంచబోమని ప్రజలకు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అంతకుముందే అమెరికా, ఇరాన్ మధ్య పెద్ద ఎత్తున యుద్ధం జరుగుతున్న సందర్భంలో ఆర్మోన్ దీవి నుంచి భారతదేశానికి క్రూడ్ ఆయిల్ ఓడరేవుల ద్వారా ఆటంకం లేకుండా సరఫరా జరిగిందని ,మన దగ్గర సరిపడా క్రూడ్ ఆయిల్ నిలువలు ఉన్నాయని మాటలు చెప్పి ,ఓట్లు అయిపోయిన అనంతరం నరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రపంచంలో వచ్చిన ఆర్థిక సంక్షోభం మూలంగా క్రూడ్ ఆయిల్ యజమానులు, పెట్టుబడిదారులకు తలోగ్గి దేశంలో పెట్రోల్ డీజిల్ ధరలను పెంచడానికి నిర్ణయించారన్నాయి. ఫలితంగా లీటర్ పెట్రోల్ డీజిల్ పైన మూడు రూపాయలు 20 పైసలు అదనపు భారం పెరిగిందని ఫలితంగా సాధారణ మధ్యతరగతి ప్రజానీకం వాడే నిత్యవసర సరుకుల పైన ధరల భారం మరింత పెరుగుతుందని. ఇప్పటికే దేశంలో ఉపాధి అవకాశాలు తగ్గి పేదరికం మరింత పెరుగుతున్న సందర్భంలో. ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెంచకుండా, ప్రజల పైన భారాలు వేయటం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుందని, ఫలితంగా ఆకలితో అలమటించే పరిస్థితులు పేదలకు కలుగుతుందని ఆయన విమర్శించారు. ప్రజలకు నష్టం చేసే పద్ధతుల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం నిర్ణయాలు చేయటం వల్ల దేశంలో పేదరికం మరింత పెరుగుతుందని అన్నారు.



ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆనాలోచితంగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను తగ్గించాలని ,లేనియెడల ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్ రాములు నగర నాయకులు నల్వాల నరసయ్య, అనసూయమ్మ, అనిత, అంజయ్య మరియు ఈవీఎల్ నారాయణ, ఉద్ధవ్, రాజు తదితరులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలి



మే 16 ( హంసకలం వార్త )

బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకానికి తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బీఎల్ఏ ల నియామకం జాబితాను నిర్ణీత ఫార్మాట్ ప్రకారం అందించాల్సిందిగా రాజకీయ పార్టీలను మరోమారు లిఖితపూర్వకంగా లేఖల ద్వారా కోరాలని సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ అమలు తీరుపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ విధివిధానాలపై దిశానిర్దేశం చేశారు. నిజామాబాద్ జిల్లాలో ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేయడం జరిగిందని ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి సీ.ఈ.ఓ దృష్టికి తెచ్చారు. గడిచిన వారం రోజుల నుండి ప్రత్యేక చొరవ చూపుతున్న ఫలితంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో కూడా మ్యాపింగ్ ప్రక్రియలో ఆశించిన పురోగతి వచ్చిందని, గడువు లోపు మ్యాపింగ్ ను పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని అన్నారు వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులతో సమావేశమై కీలక సూచనలు చేశారు. ఎస్.ఐ.ఆర్ అమలు కోసం ఎన్నికల సంఘం షెడ్యూల్ ను వెలువరించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు తప్పనిసరిగా బూత్ లెవెల్ ఏజెంట్లను నియమించి నిర్ణీత ఫార్మాట్ లో వారి వివరాలు సమర్పించేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా, తీవ్ర జాప్యం జరుగుతోందని కలెక్టర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. ఎస్.ఐ.ఆర్ షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలోనైనా బీ.ఎల్.ఓల సత్వర నియామకం ఆవశ్యకత గురించి నొక్కి చెప్పాలని, ప్రతీ వారం ఈ.ఆర్.ఓల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఎస్.ఐ.ఆర్ అమలు తీరు గురించి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో బీ.ఎల్.ఓలు ప్రతి ఇంటిని సందర్శించి ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను పక్కాగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వారికి సహకారం అందించేందుకు వీలుగా వాలంటీర్లను సమకూర్చాలని ఈ.ఆర్.ఓలను ఆదేశించారు. చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల పేర్లు కలిగిన ఓటర్లను మ్యాపింగ్ సందర్భంగా ఖచ్చితంగా గుర్తించేలా చూడాలన్నారు. తప్పులు లేకుండా ఎన్యుమరేషన్ ఫారం ఎలా నింపాలి అనే దానిపై బీ.ఎల్.ఓలకు శిక్షణ అందించాలని ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారంల పంపిణీ జూన్ 15వ తేదీ లోపు పూర్తి అయ్యేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని పోలింగ్ బూత్ ల పరిధిలో ప్రముఖుల ఓటరు మ్యాపింగ్ పూర్తయ్యిందా లేదా అన్నది ఈ.ఆర్.ఓలు స్వయంగా పరిశీలన జరపాలని సూచించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ అమలు తీరు, ప్రగతి గురించి రోజువారీగా ఆన్లైన్ లో వివరాలు పొందుపర్చాల్సి ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలని తెలిపారు. ఆయా నియోజకవర్గాలలో పోలింగ్ కేంద్రాల వారీగా బీ.ఎల్.ఓల పేరు, ఫోన్ నెంబర్లతో కూడిన వివరాలను ఓటర్లకు తెలిసేలా విస్తృత స్థాయిలో ప్రచారం చేయాలన్నారు. ముఖ్య కూడళ్ళలో బీ.ఎల్.ఓల వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు. గుర్తింపు కార్డులు లేని బూత్ లెవల్ అధికారులకు క్యూ.ఆర్ కోడ్ తో కూడిన ఐ.డీ కార్డులు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా, 6, 7, 8 ఫారాల పెండింగ్ క్లెయిమ్ లను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని, ఎస్.ఐ.ఆర్ అమలు కావడానికి ముందే జూన్ 5వ తేదీ లోపు అన్ని క్లెయిమ్ లు పరిష్కారం కావాలని గడువు విధించారు. మ్యాపింగ్ లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, డీ.ఆర్.ఓ గీత, నిజామాబాద్ ఆర్.డీ.ఓ రాజేంద్రకుమార్, బాన్సువాడ ఆర్.డీ.ఓ రవీందర్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, సీ.పీ.ఓ రతన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో తెలంగాణలో భూముల ధరలు పెంపు:మంత్రి పొంగులేటి

మే 16 ( హంసకలం వార్త )



తెలంగాణలో త్వరలో భూముల మార్కెట్ విలువ పెంచనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.హైదరాబాద్లో సైంటిఫిక్ భూము మార్కెట్ విలువ కనీసం రూ.15 లక్షలు పెరిగే అవకాశం ఉందని,ఇన్నర్,ఓఆర్ఆర్ పరిధిలో దీనిని క్రైటీరియాగా తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.గత ప్రభుత్వం అరవింద్ సుబ్రహ్మణ్యం రిపోర్టు ఆధారంగా రెండుసార్లు భూముల విలువ పెంచిందని,అయితే 2022 నుంచి ఇప్పటి వరకు భూముల మార్కెట్ విలువ పెంచలేదని మంత్రి తెలిపారు

## బిజినెస్

# ఎగుమతులు 49 నెలల గరిష్ఠం

న్యూఢిల్లీ: పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలోనూ ఎగుమతులు భారీగా పుంజుకున్నాయి. ఏప్రిల్ నెలలో భారత వస్తు ఎగుమతులు వార్షిక ప్రాతిపదికన 13.78 శాతం వృద్ధి చెంది 4,356 కోట్ల డాలర్లకు (రూ.4.18 లక్షల కోట్లు) చేరాయి. ఎగుమతుల విలువకు ఇది 49 నెలల గరిష్ఠం కాగా.. ఎగుమతుల వృద్ధికి 5 నెలల గరిష్ఠ స్థాయి. క్రూడాయిల్ రేట్లు వేగంగా ఎగబాకిన తరుణంలో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతి విలువ సైతం భారీగా పెరగడం ఇందుకు కారణమైంది. గత నెలలో భారత్‌లోకి వస్తు దిగుమతులు కూడా వార్షిక ప్రాతిపదికన 10 శాతం పెరిగి 6 నెలల గరిష్ఠ స్థాయి 7,194 కోట్ల డాలర్లకు (రూ.6.90 లక్షల కోట్లు) చేరుకున్నాయి. దాంతో వాణిజ్య లోటు సైతం 3 నెలల గరిష్ఠ స్థాయి 2,838 కోట్ల డాలర్లకు (రూ.272 లక్షల కోట్లు) పెరిగింది. ఎగుమతుల ఆదాయం, దిగుమతుల వ్యయానికి మధ్య వ్యత్యాసాన్ని వాణిజ్య లోటు అంటారు. 2025 ఏప్రిల్‌లో లోటు 2,710 కోట్ల డాలర్లుగా నమోదు కాగా.. ఈ మార్చిలో 2,067 కోట్ల డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలోనూ దేశ ఎగుమతులు మెరుగైన వృద్ధిని నమోదు చేశాయని కేంద్ర వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ అన్నారు.

గత నెలలో పెట్రోలియం ఉత్పత్తులు 960 కోట్ల డాలర్లకు (సుమారు రూ.92,160 కోట్లు), ఎలక్ట్రానిక్ ఎగుమతులు 517 కోట్ల డాలర్లకు (రూ.49,632 కోట్లు) పెరిగాయి. మరిన్ని కొత్త మార్కెట్లకు వస్తువులను ఎగుమతి చేయడం కూడా అధిక వృద్ధికి దోహదపడింది. సింగపూర్, టాంజానియా, శ్రీలంక, బంగ్లాదేశ్, హాంకాంగ్, మలేషియా, ఆస్ట్రేలియా, వియత్నాం మార్కెట్లకు ఎగుమతుల్లో మంచి వృద్ధి నమోదైంది.

**బంగారం దిగుమతులు 82% జంప్**

ఈ ఏప్రిల్‌లో భారత్‌లోకి బంగారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 81.69 శాతం పెరిగి 562 కోట్ల డాలర్లకు (రూ.53,952 కోట్లు) చేరాయి. వెండి దిగుమతులు ఏకంగా 157.16 శాతం వృద్ధితో 41.1 కోట్ల డాలర్లకు (రూ.3,946 కోట్లు) ఎగబాకాయి. అంతర్జాతీయ మార్కెట్లో వీటి ధరలు గణనీయంగా పెరగడం ఇందుకు ప్రధాన కారణమైంది. కేంద్ర ప్రభుత్వం బుధవారం పసిడి, వెండిపై దిగుమతి సుంకాన్ని ఏకంగా రెండున్నర రెట్ల స్థాయికి (6 శాతం నుంచి 15 శాతానికి) పెంచింది. అలాగే, పసిడి దిగుమతులపైనా పరిమితులు విధించింది. కాగా వెండిని పారిశ్రామిక అవసరాలకూ ఉపయోగిస్తుండటంతో సుంకం పెంపు వీటి దిగుమతులపై అంతగా ప్రభావం చూపకపోవచ్చని విశ్లేషకులు అన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2025-26)లో బంగారం దిగుమతుల విలువ 24 శాతం ఎగబాకి ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి 7,198 కోట్ల డాలర్లకు చేరుకుంది. దిగుమతుల పరిమాణం మాత్రం 4.76 శాతం తగ్గి 721.03 టన్నులుగా నమోదైంది.




**సేవల ఎగుమతులు రూ.3.58 లక్షల కోట్లు**

గత నెలలో భారత సేవల ఎగుమతులు 3,724 కోట్ల డాలర్లకు (రూ.3.58 లక్షల కోట్లు) చేరి ఉండవచ్చని అంచనా. 2025 ఏప్రిల్‌లో సేవల ఎగుమతులు 3,285 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. కాగా, గత నెల సేవల దిగుమతులు 1,666 కోట్ల డాలర్లకు (దాదాపు రూ.1.60 లక్షల కోట్లు) తగ్గాయి. గత ఏడాది ఏప్రిల్‌లో 1,691 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి. రూపాయి క్షీణత ప్రభావంపై వాణిజ్య కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ స్పందిస్తూ, ఎగుమతులకు ఇది సానుకూల పరిణామమే అని అన్నారు.

**ఎగుమతుల్లో 28% క్షీణత**

ఇరాన్‌తో అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంతో పశ్చిమాసియా ఉద్రిక్తంగా మారింది. దాంతో వరుసగా రెండో నెలా ఈ ప్రాంతానికి భారత ఎగుమతులు తగ్గాయి. ఏప్రిల్ నెలలో 28 శాతం క్షీణించి 416 కోట్ల డాలర్లకు (రూ.39,936 కోట్లు) పడిపోయాయి. 2025 ఏప్రిల్‌లో ఈ విలువ 578 కోట్ల డాలర్లుగా నమోదైంది. గత నెలలో పశ్చిమాసియా నుంచి దిగుమతులు సైతం 31.64 శాతం తగ్గి 1,047 కోట్ల డాలర్లకు (రూ.1,00,512 కోట్లు) పరిమితమయ్యాయి. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి దిగుమతులు 1,532 కోట్ల డాలర్లుగా ఉన్నాయి. ఈ మార్చిలోనైతే పశ్చిమాసియాకు ఎగుమతు లు, దిగుమతులు 50 శాతానికి పైగా క్షీణించాయి. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సౌదీ అరేబియా, ఒమన్, ఇరాన్, బహ్రెయిన్ సహా పలు దేశాలు పశ్చిమాసియా ప్రాంతం పరిధిలోకి వస్తాయి.

గత నెలలో యూఏఈకి ఎగుమతులు 36.39 శాతం తగ్గి 218 కోట్ల డాలర్లకు పడిపోగా.. దిగుమతులు కూడా 34.63 శాతం తగ్గి 407 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. సౌదీ అరేబియా కు ఎగుమతులు 2.89 శాతం క్షీణించి 85.2 కోట్ల డాలర్లకు జారుకున్నాయి. సౌదీ నుంచి దిగుమతులు మాత్రం 30.29 శాతం పెరుగుదలతో 384 కోట్ల డాలర్లకు చేరుకున్నాయి. ఒమన్ నుంచి దిగుమతులు 246.42 శాతం పెరిగి 148 కోట్ల డాలర్లకు చేరాయి.

## కిమ్స్ హాస్పిటల్స్ ఆదాయం రూ.474 కోట్లు




హైదరాబాద్ : కృష్ణా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (కిమ్స్ హాస్పిటల్స్).. 2025-26 ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జనవరి-మార్చి త్రైమాసికానికి గాను స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.473.80 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.65.90 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.370.10 కోట్లుగా ఉండగా లాభం రూ.93.5 కోట్లుగా నమోదైంది. కాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం రూ.1,440.80 కోట్ల నుంచి రూ.1,758.10 కోట్లకు పెరగగా లాభం మాత్రం రూ.302.90 కోట్ల నుంచి రూ.260.70 కోట్లకు తగ్గింది.

---

# పంజాబ్ కింగ్స్ యాజమాన్యంపై అశ్విన్ ఆగ్రహం




ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 టోర్నీ ఆరంభంలో వరుస విజయాలతో దూసుకెళ్లిన పంజాబ్ కింగ్స్.. ఇప్పుడు పీకల్లోతు కష్టాల్లో పడింది. ప్లే ఆఫ్స్‌కు చేరుకునే తొలి జట్టుగా నిలుస్తుందనుకున్న పంజాబ్.. టోర్నీ నుంచే నిష్క్రమించే పరిస్థితికి చేరుకుంది. వరుసగా ఐదు ఓటములను నమోదు చేసి పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో కొనసాగుతోంది. అయితే ఈ సీజన్‌లో పంజాబ్.. రెండు హోం వేదికలను ఎంచుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తీసుకున్న ఆ నిర్ణయంపై భారత మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాడు. జట్టుకు రెండు వేర్వేరు హోం వేదికలను ఎంపిక చేయడం సరైన విధానం కాదని తెలిపాడు. 'కోల్‌కతా నైట్ రైడర్స్, చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్.. వంటి విజయవంతమైన జట్లు తమ హోం మ్యాచ్‌లను ఒకే వేదికపై ఆడుతున్నాయి. పంజాబ్ మాత్రం ముల్లాన్‌పూర్, ధర్మశాల వేదికలను ఎంచుకుని.. అటుఇటు మారాల్సిన పరిస్థితి వచ్చింది. ఒక వేదికపై ఐదు మ్యాచ్‌లు గెలిచిన తర్వాత మరో వేదికకు మారిన పంజాబ్.. టోర్నీ నుంచే నిష్క్రమించాల్సిన పరిస్థితికి వచ్చింది. పంజాబ్ కింగ్స్ యాజమాన్యం తీసుకున్న ఈ నిర్ణయం అస్సలు సరైంది కాదు. ఇది జట్టు ప్రదర్శనలపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ అజేయంగా నిలిచింది. కానీ ధర్మశాల పిచ్ పరిస్థితులు జట్టుకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అక్కడ బ్యాటింగ్ అంత సులువుగా ఉండదు. పిచ్‌కు అలవాటు పడేలోపే జట్టు 20-40 పరుగులు తక్కువ చేస్తోంది. పంజాబ్ వరుసగా ఓడిపోవడానికి కేవలం కెప్టెన్సీ, జట్టు వైఫల్యం కారణంగా చూడకూడదు. వేదిక మార్పు కూడా ప్రధాన కారణాల్లో ఒకటి' అని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఇదిలా ఉంటే, పంజాబ్ కింగ్స్ ప్లే ఆఫ్స్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఇప్పటి నుంచి ఆడే ప్రతి మ్యాచ్‌లో గెలిచి తీరాల్సిందే. పంజాబ్ తన తదుపరి మ్యాచ్‌ను ఆదివారం ఆర్సీబీతో ఆడనుంది.

## అహ్మదాబాద్‌లో ఐసీసీ సమావేశం.. పీసీబీ ఛైర్మన్ నఖ్వీ వస్తాడా?

ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026 ఫైనల్‌కు అహ్మదాబాద్ సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఐసీసీ ఓ కీలక సమావేశం కూడా అక్కడే జరగనుంది. రాబోయే ఐసీసీ త్రైమాసిక సమావేశాలు భారత్‌లో జరగనున్నాయి. దీనికి అహ్మదాబాద్ వేదిక కానుంది. మే 21న చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ వర్చువల్ సమావేశం నిర్వహించనున్నారు. ఆ తర్వాత మే 30-31 తేదీల్లో ఐసీసీ బోర్డు ప్రత్యక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి ప్రపంచ క్రికెట్ బోర్డుల ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. అయితే పాకిస్థాన్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీ హాజరుపై మాత్రం సందిగ్ధత నెలకొంది. వాస్తవానికి ఈ సమావేశాలను మార్చి లేదా ఏప్రిల్‌లో ఖతార్‌లో నిర్వహించాలని భావించారు. కానీ పశ్చిమాసియా ఉద్రిక్తతల కారణంగా వాయిదా వేశారు. అనంతరం దీనిని అహ్మదాబాద్‌కు మార్చారు. భారత్-పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతినడంతో నఖ్వీ అహ్మదాబాద్‌కు రాకపోవచ్చనే వార్తలు వస్తున్నాయి. మరోవైపు, అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరగనున్న ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు కూడా నఖ్వీకి ఆహ్వానం అందినట్లు పాకిస్థాన్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే దీనిపై బీసీసీఐ నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. పీసీబీ ఛైర్మన్‌గా నఖ్వీ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి బీసీసీఐతో మంచి సంబంధాలు లేవు.




## స్పోర్ట్స్

### లఖ్‌నవూతో మ్యాచ్.. సీఎస్కేలో అనుభవజ్ఞులే కనిపించలేదు: అంబటి రాయుడు





ఇంటర్నెట్ డెస్క్: ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో దూసుకెళుతున్న చెన్నై సూపర్ కింగ్స్‌ను లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బ్రేక్ వేసింది. శుక్రవారం 7 వికెట్ల తేడాతో లఖ్‌నవూపై సీఎస్కే ఘోర పరాజయాన్ని చవిచూసింది. దీంతో ప్లే ఆఫ్స్ ఆశలు మరింత సంక్లిష్టంగా మారాయి. అయితే సీఎస్కే స్టార్ పేసర్ అన్షుల్ కాంబోజ్.. ఈ మ్యాచ్‌లో పూర్తిగా తేలిపోయాడు. 2.4 ఓవర్లు వేసి ఏకంగా 63 పరుగులు సమర్పించుకున్నాడు. ఎల్ఎస్‌జీ బ్యాటర్లు మిచెల్ మార్ష్, పూరన్.. కాంబోజ్‌ను టార్గెట్ చేసి విజృంభించారు. ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు.

'లఖ్‌నవూ మ్యాచ్ సమయంలో సీఎస్కే జట్టును చూస్తే ఆటను నియంత్రించే అనుభవజ్ఞులు మైదానంలో ఉన్నట్లు అనిపించలేదు. అన్షుల్ కాంబోజ్ తీవ్ర ఒత్తిడిలో ఉన్న సమయంలో అతడికి మార్గనిర్దేశం చేసే సీనియర్ల కొరత జట్టులో స్పష్టంగా కనిపించింది. మిచెల్ మార్ష్ దూకుడుగా ఆడుతూ కాంబోజ్ బౌలింగ్‌లో వరుసగా నాలుగు సిక్సర్లు బాదేశాడు. అలాంటి సమయంలో ఎవరైనా అనుభవజ్ఞుడు అతడి వద్దకు వెళ్లి పరిస్థితిని చక్కదిద్దాల్సింది. అతడి దగ్గరకి వెళ్లి..'కాస్త ప్రశాంతంగా ఉండు.. ఒత్తిడి లేకుండా బౌలింగ్ చేయ్.. నీకు మేమున్నాం' అనే భరోసా ఇవ్వాల్సింది. వికెట్ కీపింగ్ చేస్తోన్న సంజు శాంసన్ కూడా ఆ పరిస్థితిని మార్చేందుకు ప్రయత్నించలేదు. స్లో బాల్ వేయాలా? యార్కర్ వేయాలా? వంటి సూచనలు ఇచ్చి కాంబోజ్ ఆలోచనలను కాస్త మళ్లించే ప్రయత్నం చేయాల్సింది. అన్షుల్ ఈ సీజన్ మొత్తం అద్భుత ప్రదర్శనలు చేశాడు. అతడికి లఖ్‌నవూతో మ్యాచ్ ఓ పీడకల. అన్షుల్ వేసిన బంతుల్లో ఎలాంటి తప్పు లేదు. మార్ష్ బ్యాటింగ్ కారణంగానే భారీ షాట్లు వచ్చాయి' అని రాయుడు వివరించాడు.

# హీరో రామ్ దర్శకత్వంలో సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్

-వీర పాత్రలో హీరో రామ్ సరికొత్త అవతారం



హీరో రామ్ పోతినేని తన కెరీర్‌లో మరో కీలక అడుగు వేయబోతున్నారు. నటుడిగా తన వైవిధ్యాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూ వచ్చిన రామ్ 'ఆంధ్ర కింగ్ తాలూకా'తో తొలిసారి లిరిసిస్ట్‌గా మారి ప్రశంసలు అందుకున్నారు. అంతేకాదు, గాయకుడిగానూ తన గాత్రాని వినిపించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఇప్పుడు తన 23వ చిత్రంతో దర్శకుడిగా కొత్త ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నారు. శుక్రవారం తన పుట్టినరోజు సందర్భంగా అధికారికంగా ప్రకటించిన ఈ చిత్రం స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. తెలుగు సినిమాలో అరుదుగా కనిపించే ఈ జోనర్‌పై ఇప్పటికే భారీ ఆసక్తి నెలకొంది. కొత్తగా శ్రీకారం చుట్టిన ఈ చిత్రాన్ని రాపో సినిమాటిక్స్ బ్యానర్‌పై కృష్ణ పోతినేని నిర్మించనున్నారు. ఈ చిత్రంతో రామ్ పోతినేని నటుడి నుంచి దర్శకులుగా మారిన ఎన్టీఆర్, కృష్ణ, పవన్ కళ్యాణ్ వంటి స్టార్స్ జాబితాలో చేరడం విశేషం. మేకర్స్ విడుదల చేసిన బర్త్‌డే స్పెషల్ పోస్టర్‌లో రామ్ పోషిస్తున్న 'వీర' పాత్రను పరిచయం చేశారు. లెదర్ జాకెట్‌లో వెనుక నుంచి కనిపిస్తున్న రామ్ లుక్ డార్క్, ఇంటెన్స్, రగ్గడ్ వైబ్‌ను క్రియేట్ చేస్తోంది. అతని స్టైలిష్ వి-కట్ హెయిర్‌స్టైల్ పాత్రలోని అగ్రెసివ్ యాటిట్యూడ్‌ను ప్రతిబింబిస్తోంది. పోస్టర్ బ్యాక్‌డ్రాప్‌లో కనిపిస్తున్న ఎరుపు రంగు 'విఅక్షరం... 'వీర'తో పాటు తిరుగుబాటు, ఆధిపత్యానికి సంకేతంగా నిలుస్తోంది. ఇరువైపులా కనిపించే స్కైస్క్రేపర్స్ క్రైమ్‌తో నిండిన వాతావరణాన్ని సూచిస్తున్నాయి. 'ది స్టోరీ ఆఫ్ ఎ లోన్ వూల్ఫ్ అనే ట్యాగ్‌లైన్ ఒంటరితనం, మానసిక సంఘర్షణలతో నిండిన పాత్రను సూచిస్తోంది. దర్శకుడిగా రామ్ పోతినేని స్వయంగా రూపొందించిన కథతో తెరకెక్కుతున్న ఈ సినిమా ఓ కొత్త తరహా అనుభూతిని ఇవ్వబోతోంది. 'వీర' పాత్రలో రామ్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని అవతార్‌లో కనిపించనుండగా, పోస్టర్ నుంచే ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ స్పష్టంగా కనిపిస్తోంది. ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ జూన్‌లో ప్రారంభం కానుండగా, ఈ ఏడాది డిసెంబర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

# పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూల స్పందన



ఎటువంటి ఇబ్బందులు లేకుండా 'పెద్దిసినిమా జూన్ 4న ఆరోగ్యకర వాతావరణంలోనే విడుదలవుతుందని, ఆ విషయంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని నిర్మాత దిల్ రాజు తెలిపారు. నిర్మాత, ప్రదర్శన, పంపిణీ రంగాలకు చెందిన సభ్యుల సంయుక్త సమావేశం శుక్రవారం ఉదయం తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో ప్రదర్శక రంగానికి సంబంధించిన 'శాతాల విధానం' పై చర్చించారు. ఈ సమస్యకు ఒక సముచిత పరిష్కారం కనుగొనేందుకు, శాతాల వివాదాన్ని త్వరితగతిన పరిష్కరించేందుకు గాను ఒక ఉప కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ఉప కమిటీ తన విధులను నిర్మాతలు డి. సురేష్ బాబు, అల్లు అరవింద్, దిల్ రాజు, కె. ఎల్. నారాయణ, కె. అశోక్ కుమార్ మార్గదర్శకత్వంలో నిర్వర్తిస్తుంది. తదనుగుణంగా నిర్మాత, ప్రదర్శక, పంపిణీ రంగాల సభ్యులతో కూడిన పై ఉప కమిటీకి నిర్మాణ రంగం నుంచి వై. సురేందర్ రెడ్డి, వై. సుప్రియ, వై. రవి శంకర్, బి. బాపినీడు, చెరుకూరి సుధాకర్, జి. శ్రీనివాస్ కుమార్, టి. ప్రసన్న కుమార్, అలాగే ప్రదర్శన రంగం నుంచి వి. ప్రతాప్ రెడ్డి, టి. బాల్గోవింద్ రాజ్, కె. అనుపమ్ రెడ్డి, పి. శ్రీనివాస రావు, జి. వీరనారాయణ బాబు, కె. వంశీ కిషోర్ (చిన్ని), ఎం. విజేందర్ రెడ్డి, పంపిణీ రంగం నుంచి డి. విష్ణు మూర్తి, వి. వీరనాయుడు, ఎన్. సుధాకర్ రెడ్డి, ముత్యాల రామదాసు, ఎన్. నాగార్జున, బి. మధుసూదన్ రెడ్డి (ఠాగూర్ మధు), శ్రీ ధీరజ్ మొగిలేని సభ్యులుగా నామినేట్ చేయాలని నిర్ణయించారు. ఈ సభ్యులందరూ రెండు నెలల్లో ఒక నివేదిక ఇవ్వాలని ఫిల్మ్ ఛాంబర్ ఆదేశించింది. ఈ సమావేశం అనంతరం దిల్ రాజు మీడియాతో మాట్లాడుతూ,'ఎగ్జిబిటర్లు, నిర్మాతల మధ్య ఫిల్మ్ ఛాంబర్‌లో మీటింగ్ జరిగింది. సమస్యలపై చర్చించి, పరిష్కరించుకున్నాం. ఎగ్జిబిటర్లు కోరుతున్న పర్సంటేజీ విధానానికి నిర్మాతలు సానుకూలంగా స్పందించారు. ఈ మేరకు ఓ కమిటీ ఏర్పాటుకానుంది. ఏ, బీ, సీ.. ఇలా ఆయా సెంటర్లలోని థియేటర్‌ను బట్టి పర్సంటేజీని కమిటీ నిర్ణయిస్తుంది అని తెలిపారు.

# లీలావతిగా కీలక పాత్ర



అభిషేక్ నామా దర్శకత్వంలో విరాట్ కర్ణా నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం జూలై 3న థియేటర్లలో విడుదల కానుంది.ఈ నేపథ్యంలో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. ప్రతీ అప్‌డేట్‌తో ఈ చిత్రంపై బజ్ నెక్ట్స్ లెవల్ కి చేరుతోంది. ఇప్పటికే విడుదలైన టీజర్, గ్లింప్స్, సాంగ్స్ సినిమాపై మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేశాయి.తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి అనసూయ భరద్వాజ్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. 'లీలావతి' పాత్రలో ఆమె లుక్ పవర్‌ఫుల్‌గా, మిస్టీరియస్‌గా కనిపిస్తోంది.సంప్రదాయ తెలుపు చీరలో, ట్రైబల్ జ్యువెలరీతో అనసూయ కనిపించిన తీరు పాత్రలోని తీవ్రతను ప్రతిబింబిస్తోంది. లీలావతి పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉండబోతోందనే ఫీల్ ఈ పోస్టర్‌తోనే స్పష్టమవుతోంది.ఈ సినిమాలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్, రిషబ్ సాహ్నీ, జగపతి బాబు, గరుడ రామ్, మహేష్ మాంజ్రేకర్, జయప్రకాశ్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్ నిర్మాణంలో వస్తున్న 'నాగబంధం' పౌరాణికం, చరిత్ర, యాక్షన్ అంశాల కలయికగా రూపొందుతోంది. "నాగబంధం దేశ వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకంతో ఉన్నాం అని మేకర్స్ అన్నారు.

# సలార్ రాజు దొరికాడా.. లేదా?



జీ5 ఎప్పటికప్పుడు వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకులను మెప్పిస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు మరో డిఫరెంట్ వెబ్ సిరీస్‌తో ఆడియెన్స్‌ను అలరించటానికి సిద్ధమైంది. అదే "వేము'కాప్'లం". ఈనెల 22 నుంచి ఈ సిరీస్ జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలో ఈ సిరీస్‌పై మరింత ఆసక్తిని పెంచేలా ట్రైలర్‌ను విడుదల చేశారుమహదేవపట్నం అనే ప్రాంతంలో కథ మొదలవుతుంది. అయ్యగారు వారసుడొచ్చాడండోయ్.. అని పాలేరు అని అరిచి మరి చెబుతాడు. అప్పుడు గజపతిరాజు పాత్రలో నటించిన నాగబాబు ఆనందపడతాడు. సలార్‌రాజు తన వారసుడు అని ప్రకటిస్తాడు. అయితే అనుకోకుండా ఆ సలార్ రాజు కనిపించకుండా పోతాడు. దీంతో ఊరంతా గందరగోళంలో పడుతుంది. ఇంతకీ సలార్ రాజు ఎవరో కాదు.. కోళ్ల పందెల్లో పాల్గొనాల్సిన కోడిపుంజు. దీన్ని వెతకటానికి ఇద్దరు పోలీసులు(గెటప్ శీను, రవితేజ నన్నిమల) ఊళ్లోకి వస్తారు. సలార్ రాజు కనిపించకపోవటం వల్ల..ఎవరికి లాభం అనే కోణంలో పోలీసులు అన్వేషిస్తుంటారు. అయితే వారికి ఊళ్లో మరో సమస్య కనిపిస్తుంది. ఇంతకీ సలార్ రాజు దొరికాడా? లేదా? అనే విషయాలు తెలియాలంటే ఈనెల 22న జీ5లో స్ట్రీమింగ్ కానున్న ఈ వెబ్ సిరీస్ చూడాల్సిందేనంటున్నారు మేకర్స్. నాగబాబు ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌ను రా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి, కౌముది కె నేమాని నిర్మాతలుగా ప్రదీప్ మద్దాలి క్రియేటివ్‌తో కలిసి రూపొందింది. 'వికటకవి' డైరెక్టర్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. శోభన్ చిట్టుప్రోలు కథను అందించారు.

# 'పెద్ది'లో రామ్ బుజ్జిగా దివ్యేందు శర్మ



హీరో రామ్ చరణ్ నటిస్తున్న రస్టిక్ స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో నిర్మాత వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై 'పెద్ది'ని భారతీయ సినిమాకు కొత్త అనుభూతిని ఇచ్చే విజువల్ స్పెక్టకిల్‌గా రూపొందించారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న థియేట్రికల్ ట్రైలర్‌ను ఈనెల 18న ముంబైలో గ్రాండ్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈలోగా మేకర్స్ మరో సర్ప్రైజ్ ఇచ్చారు. ఈ చిత్రంలో మీర్జాపూర్ ఫేమ్ దివ్యేందు శర్మ పోషిస్తున్న పవర్‌ఫుల్ పాత్ర 'రామ్ బుజ్జి'ని పరిచయం చేస్తూ వీడియో రిలీజ్ చేశారు. క్రికెట్ మైదానంలో రామ్ బుజ్జి ఎంట్రీ ఇచ్చిన తీరు, అతని బాడీ లాంగ్వేజ్, రగ్గడ్ యాటిట్యూడ్ పాత్రలోని ఇంటెన్సిటీని బలంగా చూపించాయి. దివ్యేందు శర్మ స్క్రీన్ ప్రెజెన్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కలిసి వీడియోకి మాస్ వైబ్ తీసుకొచ్చాయి. దీంతో రామ్ బుజ్జి పాత్ర సినిమా కథలో ఎంత కీలకంగా ఉండబోతోందోనన్న ఆసక్తి ప్రేక్షకుల్లో మరింత పెరిగింది. 'పెద్ది' జూన్ 4, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, జూన్ 3న ప్రీమియర్స్ ప్రారంభం కానున్నాయి.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449